J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 19 15.10.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# ఏపీలో.. ఏం జరుగుతోంది?

- ఐఏఎస్, ఐఆర్ఎస్‌ల గుప్పెట్లో జగన్ ప్రభుత్వం ఉందా?
- ముఖ్యమంత్రి చుట్టూ అధికారులూ... 'డమ్మీ' అడ్వైజర్లు!
- నిజాలు చెప్పగలిగే వారికి 'నో-ఎంట్రీ'
- పాలనకు, ప్రజలకు దూరంగా మంత్రులు!

*దివంగత ప్రజా నాయకుడు వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాయకత్వ వారసుడు, ఆయన తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రా ముఖ్యమంత్రి కావాలి. 20 ఏళ్ళ పాటు ఈ రాష్ట్రంలో ఆయన పరిపాలన కొనసాగాలి. యువ నాయకత్వపు సారధ్యంలో ఈ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలి. రాజశేఖరరెడ్డి ఆశయ సాధనలో జగన్మోహన్‌రెడ్డి తండ్రిని మించిన తనయుడిగా ప్రసిద్ధి చెందాలి. అందుకే 'కావాలి జగన్ - రావాలి జగన్'... ఇది సామాన్యుడు సైతం దిక్కులు దద్దరిల్లేలా 2019 ఎన్నికలలో వినిపించిన నినాదం.*


ఇప్పుడు రాష్ట్రంలో అదే జరుగుతోందా...? ప్రజలు, వై.ఎస్ అభిమానులు, ఆయన కుటుంబ అనుయాయులు ఆశించిన పాలన సాగుతోందా..? అందరూ కోరుకున్న విధంగా పరిపాలన నడుస్తోందా...? అంటే... లేదనే అంటున్నారు రాజకీయ మేధావులు. పాలన మొత్తం ఐఏఎస్, ఐఆర్ఎస్ చేతుల్లోకి వెళ్లిపోయిందన్నది వారి భావన. డమ్మీ సలహాదారుల చేతిలో రాష్ట్రం నలిగిపోతోందన్నది వారి అభిప్రాయం. ఈ రెండున్నరేళ్ళ కాలంలో లక్షల కోట్ల రూపాయలు ఉత్త పుణ్యాన ప్రజల ఖాతాలలోకి నేరుగా చేరిపోయాయి అంటున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది.

మొన్న ఉండవల్లి అరుణ్‌కుమార్ చెప్పినట్లుగా... ఈ రెండున్నరేళ్ళల్లో... ఆరు లక్షల కోట్ల రూపాయలకుపైగా అప్పులు. వాటి మీద వడ్డీయే ఏడాదికి 42 వేల కోట్లు చెల్లించాలి. ఇంకా రెండున్నరేళ్ల పదవీకాలం ఉంది. కొత్తగా అప్పులు పుట్టే పరిస్థితి లేదు. మరోవైపు మధ్య తరగతి ప్రజలు భరించలేనంతగా పన్నులు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆలస్యం. రోడ్ల మరమ్మతులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు. జరుగుతున్న ఘోరాలను, వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రికి చెప్పగలిగే నిజమైన సలహాదారులు, శ్రేయోభిలాషులు(ప్రభుత్వ సలహాదారులు కాదు) ఆయన క్యాంపు కార్యాలయం దరిదాపులకు కూడా వెళ్ళే పరిస్థితి లేదు. ఏం చేసినా అడిగే దిక్కు లేదన్న ధీమాతో, ఎమ్మెల్యేలు, మంత్రులు వారి బంధువర్గం దొరికిన మేరకు దోచుకునే పనిలో క్షణం తీరిక లేకుండా ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరి ఆగడాలకు పట్టపగ్గాలు లేకుండా పోయాయని అంటున్నారు. జగన్ వైఖరితో వారందరికీ 'ఫ్రీ హ్యాండ్' దొరికినట్టయిందనే విమర్శలు గట్టిగానే వినబడుతున్నాయి. మరోవైపు టీడీపీ 'గోతి కాడ నక్క' సామెత చందంగా, ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుదల మీద గంపెడు ఆశతో ఉంది. జనసేనానితో కలసి బరిలో దిగడానికి రాబోయే ఎన్నికల కోసం ఓపికగా ఎదురు చూస్తోంది.

## చుట్టూ అధికారులూ, అపరిపక్వత కలిగిన సలహాదారులూ...

ముఖ్యమంత్రి నాలుగు గోడలకే పరిమితం కావడంతో

10లో



## శ్రీవారి సేవలో సీఎం

సీఎం తిరుమల సందర్శన కార్యక్రమం ఆద్యంతం ఎంతో సంప్రదాయబద్ధంగా, భక్తిభావసమన్వితంగా జరిగింది. కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 11వ తేది పట్టువస్త్రాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా తిరునామం ధరించి, పంచెకట్టుతో వచ్చి తిరుమలేశుని దర్శించుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుకుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం వెంట టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, ఇఓ జవహర్‌రెడ్డిలు పాల్గొని శ్రీవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను ముఖ్యమంత్రికి అందజేశారు. అనంతరం 2022 డైరీలను, క్యాలెండర్లను సీఎం ఆవిష్కరించారు. తొలుత తిరుపతిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి సీఎం శ్రీకారం చుట్టారు. శ్రీ వేంకటేశ్వర సప్త గోప్రదక్షిణ మందిర సముదాయానికి, తిరుపతిలోని అలిపిరి వద్ద పునర్నిర్మించిన నడకదారి పైకప్పుకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేసి శ్రీవారి చిత్రపటాలకు పూలు సమర్పించారు.

12లో



# మరీ ఇంత ఘోరమైన పాలనా?

## - వైకాపా తీరుపై సోమిరెడ్డి మండిపాటు



దశాబ్దాల తరబడి రాజకీయాల్లో ఉంటున్నాం కానీ..ఎప్పుడూ ఇంతటి ఘోరమైన పరిపాలన చూడలేదు. ఇంత అవినీతి పాలన ఎప్పుడూ లేదు.. మరీ ఇంత ఘోరమా?.. అంటూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈనెల 10న ఆయన వెంకటాచలం మండలంలోని అనికేపల్లిలో టిడిపి నాయకుడు గుమ్మడి రాజాయాదవ్ జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం తీరును దుయ్యబట్టారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు స్వార్థంతో ధనాశతో ప్రజలకు సమస్యలను సృష్టిస్తున్నారని, అదేమని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, ఇంతటి దుర్మార్గమైన పాలన ఎప్పుడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కుంభకోణాలకు, గ్రావెల్ దోపిడీలకు పాల్పడుతున్న వారిని వదిలేసి, వాటిని ప్రశ్నించిన టిడిపి నాయకులపై కేసులు పెట్టడం ఏమిటని?.. ఇదేం పరిపాలన అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంత కక్షపూరిత ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. ఇలాంటి అక్రమ కేసులు ఎన్ని పెట్టినా టిడిపి భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన టిడిపి నిలబడుతుందని, ప్రజలకు న్యాయం జరిగేవరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. కాకుటూరులో కోట్లాది రూపాయల భూ కుంభకోణాలు జరుగుతున్నా ఎవరూ పట్టించు కోవడం లేదని విమర్శించారు. టిడిపి నాయకులు కుంకాల నాగేంద్రప్రసాద్, బొమ్మిన సురేంద్ర, కోదండనాయుడు, మావిళ్ళపల్లి శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పింఛన్లను తొలగించడం దారుణం

## నాయకుల ఆవేదన




ఏవేవో కారణాలు చూపుతూ దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లను తొలగించడం బాధాకరమని, ప్రభుత్వం వెంటనే ఈ విషయం పరిశీలించి వైకల్యాలతో బాధలుపడుతున్న దివ్యాంగులను ఆదుకోవాలని, తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని దివ్యాంగుల హక్కుల పోరాటసమితి నాయకులు గోపాల్, సురేష్ కోరారు. ఈనెల 10న నెల్లూరులోని పడారుపల్లి దివ్యాంగుల కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, వారిని లేనిపోని సమస్యలకు గురిచేయడం దారుణమన్నారు. అసలే అనేక రకాల శారీరక, మానసిక సమస్యలతో సతమతమవుతున్న దివ్యాంగులకు చేయూతనందించాల్సిన ప్రభుత్వం, మానవతా దృక్పథంతో ఇచ్చిన పింఛన్లను సైతం తొలగించడంతో నిరుపేద దివ్యాంగులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం దివ్యాంగుల పట్ల కనికరం చూపి వారికి ఇస్తున్న పింఛన్లను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయుడు, మహిళా అధ్యక్షురాలు సుజాత, నగర అధ్యక్షులు సుకుమార్, బాబుయాదవ్, పెంచలయ్య, ఆలేఖ్య, సులోచన, మురళీగౌడ్ పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం.. ప్రతి ఒక్కరి బాధ్యత

## డ్వామా పీడీ తిరుపతయ్య

మొక్కలు నాటడం ప్రతిఒక్కరు తమ బాధ్యతగా తీసుకుని పచ్చదనాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ తిరుపతయ్య చెప్పారు. ఓజిలి మండలంలోని రాచపాళెం గ్రామంలో ఇటీవల జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా సుమారు మూడు కిలోమీటర్ల పొడవునా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన ఈనెల 12న పరిశీలించారు. మొక్కలు బాగా పెరిగేందుకు అందరూ సహక రించాలని ఆయన కోరారు. ఓజిలి మండలంలోని 14 పంచాయతీల్లో 26 కిలోమీటర్ల పొడవునా మొక్కలు నాటామని, వాటి సంరక్షణ కోసం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరుచేయడం జరుగుతుందని చెప్పారు. మొక్కలు చెట్లుగా బాగా ఎదిగేవరకు ఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. వీరివెంట గూడూరు డివిజన్ ఏపిడి గోపి, ఏపిఓ ఉషారాణి, టెక్నికల్ అసిస్టెంట్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# 'నుడా' లే-అవుట్లలో అన్ని వసతులుంటాయి

## బుచ్చి కమిషనర్ శ్రీనివాసరావు

నుడా (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలో అన్ని అనుమతులతో వేసిన లే-అవుట్లకు ఎప్పుడూ విలువ ఉంటుందని, ఆ లేఅవుట్‌లలో అన్ని వసతులు ఉంటాయని, స్థలానికి కూడా బ్యాంకు రుణం లభిస్తుందని బుచ్చిరెడ్డి పాళెం నగర కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు. ఈనెల 10 బుచ్చిరెడ్డిపాళెంలో తొలిసారిగా నుడా అనుమతులు పొందిన జెవిఆర్ సన్‌సిటీలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ బుచ్చి నగరపాలక పంచాయతీ అయ్యాక జెవిఆర్ సన్‌సిటీ నుడా అనుమతులు పొందిన మొట్టమొదటి లే-అవుట్‌గా రూపుదిద్దుకోవడం సంతోష కరమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్య క్షత వహించిన వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి నాయకత్వంలో బుచ్చి రెడ్డిపాళెం అన్ని సౌకర్యాలతో బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. కనిగిరి రిజ ర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల తాము కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. త్వరలోనే ఇది ఆచరణలోకి వస్తుందని ఆయన ఆకాం క్షించారు. బుచ్చిరెడ్డిపాళెం వైకాపా అధ్య క్షులు ఇన్నమూరి నరసింహారావు, రిటైర్డ్ డి.ఇ రమణయ్య, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు డి.నరసింహారావు పాల్గొన్నారు.

## సరస్వతీదేవిగా..

# శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కొలువైవున్న ఆదిలక్ష్మీదేవి అమ్మవారు ఈనెల 12న సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా తొలుత ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు.

# సాగు చట్టాలను రద్దుచేయాలి

## - సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన



ప్రధాని మోడీ తీసుకువచ్చిన సాగు చట్టాలను వెంటనే రద్దు చేయాలంటూ సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 10న నెల్లూరులోని గాంధీ బొమ్మ వద్ద చేపట్టిన ఆందోళనలో సిపిఎం నాయకులు మాట్లా డారు. కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా లఖింపూర్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై వాహనం నడిపి పలువురి ప్రాణాలు పోయేందుకు కారణమైన నిందితులు వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. అందుకు కారణంగా చెప్తున్న కేంద్రహోం శాఖ సహాయ మంత్రి కుమారుడిపై విచారణ జరపాలని, నిందితులెవరైనా సరే కఠినంగా శిక్షించాలన్నారు. నల్లచట్టాలు రద్దయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. తొలుత లఖింపూర్‌లో మరణించిన రైతునాయకులకు శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఎం నాయ కులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు, ఆలూరు తిరుపాలు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, గండవరపు శ్రీనివాసులు, సిఐటియు నాయకులు ప్రసాద్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లఖింపూర్ మృతులకు..

# రైతు నాయకుల నివాళి



ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్, ఖేర్ ప్రాంతాల్లో ప్రాణాలు కోల్పోయిన రైతు నాయకులకు కోవూరులో రైతు నాయకులు నివాళులర్పించారు. ఈనెల 10న జరిగిన ఈ కార్యక్రమంలో రైతుసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వెంకమరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న నాయకులపై వాహనం నడిపి పలువురి ప్రాణాలు తీయడం అమానుషమన్నారు. ఈ ఘటనలో నిందితులను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. తొలుత కొవ్వొత్తులు వెలిగించి చనిపోయిన రైతునాయకులకు నివాళు లర్పించారు. నాయకులు ఖాదర్‌బాషా, ఎం.సుబ్బారావు, కె.రామయ్య, బాబు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ఐలైన.. హెడ్‌కానిస్టేబుళ్ళు

జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న తొమ్మిదిమంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఈనెల 12న ఉత్తర్వులిచ్చారు. కె.శివయ్య (ఎస్ఆర్ పురం), ఆర్ ధర్మయ్య (రైల్వే), సిహెచ్ రామేశ్వరరావు (రాపూరు), బీవి రమణయ్య (జలదంకి), వి.శ్రీనివాసులు (దర్గామిట్ట), వి.రాఘవయ్య (తడ), ఎంవి నారపరెడ్డి (బాలాయపల్లి), ఎం.మాలినిదేవి (రైల్వే), బి.భాగ్యలక్ష్మి (చిన్న బజారు)లు ఉద్యోగోన్నతి పొందినవారిలో ఉన్నారు.

# చూశారా!.. సీసీ కెమెరాలతో ఎంత ఉపయోగమో!

## పోగొట్టుకున్న లక్ష..నిమిషాల్లోనే దొరికింది



సీసీ కెమెరాల వల్ల ఎంత ఉపయోగం ఉందో తేటతెల్లం చేసే సంఘటన నెల్లూ రులో జరిగింది. ఓ వ్యక్తి జేబునుంచి కిందపడిపోయిన లక్ష రూపాయల నగదు ఎవరికి దొరికిందో నిమిషాల్లో తెలిసిపో యింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సీసీ కెమెరాలను పరిశీలించి, పోయిన ఆ నగదును గుర్తించి సొంతదారునికి చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. వేదాయ పాళెంకు చెందిన బ్రహ్మారాజ్‌కుమార్ యుఏఎస్‌లో స్థిరపడ్డారు. ఇటీవల నెల్లూరుకు వచ్చి మైపాడు గేటు ప్రాంతంలోని స్నేహి తుడిని కలిసేందుకు వెళ్తుండగా పొర పాటున ప్యాంటు జేబులో ఉన్న లక్ష రూపా యల నగదు ఉన్న కవరు రోడ్డు మీద పడిపోయింది. కొంతసేపయ్యాక జేబులో డబ్బు ఎక్కడో పడిపోయిందని తెలుసుకున్న



బ్రహ్మారాజ్‌కుమార్ అంతా వెదికినా కని పించకపోవడంతో నవాబుపేట పోలీసు ఇన్స్‌పెక్టర్ టివి సుబ్బారావుకు ఆ విషయం తెలిపారు. వెంటనే ఆయన రంగంలోకి దిగి సీసీ కెమెరాలు పరిశీలిస్తే మైపాడు గేటు ప్రాంతంలో రోడ్డుపై పడిపోయిన ఆ డబ్బున్న కవరును ఒక బాలుడు తీసుకువెళ్ళడాన్ని గుర్తించి ఆరాతీసి ఆ బాలుడిని కూడా గుర్తించారు. పోలీసు సిబ్బందితో కలిసి వెళ్ళి ఆ బాలుడి ఇంటి కెళ్ళి ఇంట్లో ఉన్న లక్ష రూపాయల నగదున్న కవరును తిరిగి సొంతదారుడికి అప్పగిం చారు. దీంతో బ్రహ్మారాజ్‌కుమార్ సంతోషంతో ఇన్స్‌పెక్టర్ సుబ్బారావుకు, క్రైం పోలీసులు టి.శ్రీనివాసులు, బి.మోహన్ బాబులకు కృతజ్ఞతలు చెప్పారు. కేవలం పదిహేను నిమిషాల వ్యవధిలోనే నగదు కవరు ఎక్కడుందో గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతైనా అమోఘం కదా!.. ప్రజలు కూడా తమ ఇళ్ళ వద్ద, దుకాణాల వద్ద, అవసరమనుకున్న చోట్లంతా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, అన్ని రకాలుగా అవి ఎంతగానో ఉపయోగ పడతాయని పోలీసులు పదేపదే చెప్తున్నది అందుకే!...

# దేదీప్యమానంగా.. దేవీ నవరాత్రులు

- జగన్మాతకు వైభవోపేతంగా పూజలు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు




దసరా సందర్భంగా జిల్లాలోని అనేక దేవాలయాల్లో కొలువై వున్న అమ్మవార్లకు శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈనెల 7 నుంచి 15వ తేదీ దాకా వైభవోపేతంగా జరిగిన ఈ వేడుకలతో ఆలయాల్లో నవరాత్రి శోభ వెల్లివిరిసినట్లయింది. భక్తులు పెద్దపెట్టున చేసిన జగన్మాత నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. ఎటుచూసినా సుగంధభరిత పుష్పాలంకరణలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలతో దేవాలయాలన్నీ ధగధగ మెరిసిపోయాయి. ఈ తొమ్మిది రోజులూ ఆ జగన్మాతకు శోభాయమానంగా అలంకారాలు, విశిష్ట పూజలు జరిగాయి. ఒక్కోరోజు ఒక్కో అమ్మవారి అలంకారంతో, నవదుర్గల అలంకారాలతో ఆ జగదంబ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నవరాత్రుల రోజుల్లో దుర్గామాతను ఆరాధించడం, వివిధ రూపాల్లో ఆ జగన్మాతను అలంకరించి ఆరాధించడం అనాదిగా వస్తున్న ఆచారం. ముఖ్యంగా ఆదిపరాశక్తి అయిన ఆ జగదంబ నవదుర్గ రూపాలైన శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ రూపిణి, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి రూపాల్లో ప్రత్యక్షం కాగా, భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధించి తరించారు.

## కళకళలాడిన ఆలయాలు :

జిల్లాలోని ప్రముఖ అమ్మవార్ల ఆలయాలైన జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం, పెంచలకోనలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం, సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ దేవాలయం, వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయం, గంగపట్నం చాముండేశ్వరి అమ్మవారి దేవాలయం, వేదగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయం, నరసింహకొండపైనున్న శ్రీ ఆదిలక్ష్మీదేవి-నృసింహస్వామివార్ల దేవాలయం, కావలిలోని కలుగోళమ్మ ఆలయం, నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం, నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి దేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర దేవాలయం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి వారి దేవాలయం, నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళలమ్మ వారి దేవాలయం, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం, మూలాపేటలోని ద్రౌపతీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవాలయం, శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయం, నవాబుపేటలో భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం.. ఇలా అనేక దేవాలయాలు ఈ ఉత్సవాల రోజుల్లో భక్తుల రాకపోకలతో కళకళలాడాయి. విశిష్టమైన పూజలు, విశేషమైన రీతిలో జరిగిన అమ్మవార్ల అలంకారాలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. ప్రత్యేకించి నెల్లూరు నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో జరిగిన నవరాత్రి వేడుకలు భక్తులకు మరెంతగానో కనువిందు చేశాయి. జై భవాని..జైజై భవాని అంటూ అమ్మవారి భక్తులు పెద్దసంఖ్యలో నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధికి పెద్దఎత్తున తరలివచ్చి ఈ నవరాత్రుల రోజుల్లో నిత్యం ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు భజనలు చేశారు. మహిళాభక్తులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి అమ్మవారికి మొక్కుకున్నారు. అమ్మవారు చండి, భవాని, గాయత్రి, అన్నపూర్ణ, సరస్వతీదేవి, గజలక్ష్మి, కాళికాదేవి, దుర్గామాత, మహిషాసురమర్ధిని, శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాలతో వెలుగొందుతూ భక్తులకు కనువిందు చేశారు. ఈసారి కూడా ఆలయ నిర్వాహకులు ఇక్కడ పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఉత్సవ వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కనీవినీ ఎరుగని విధంగా ఈ నవరాత్రుల్లో విశేషమైన అలంకరణలు చేసి పూజలు చేశారు. భక్తులంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆలయాలకు వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, పెద్దసంఖ్యలో ప్రజలు తమకు అందుబాటులో ఉన్న ఆలయాలకు వెళ్ళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.



# ఆపదల్లో అత్యవసరం.. ప్రథమ చికిత్స

### రెడ్‌క్రాస్ కమిటీ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి



ఆపద సమయాల్లో ప్రథమ చికిత్స ఎంతో అవసరమవుతుందని, కనుక ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్స పట్ల అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 11న ఆయన నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ జిల్లా శాఖ, న్యూఢిల్లీలోని సెయింట్ అంబులెన్స్ సంస్థ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగే సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు, పాముకాటు, తేలుకాటు తదితర ప్రమాద సమయాల్లోను, నీళ్ళలో మునిగిపోయినప్పుడో, ప్రమాదాల్లో గాయపడినప్పుడో తప్పనిసరిగా ప్రథమ చికిత్స అవసరమవుతుందన్నారు. బాధితుడిని డాక్టర్ వద్దకు తీసుకువెళ్ళేలోపు ప్రాణాపాయం లేకుండా కాపాడేందుకు ప్రథమ చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పరిశ్రమల వారు, పలు సంస్థల వారు కూడా ప్రథమ చికిత్స అవసరాన్ని గుర్తించి తమ సిబ్బందికి ఇలాంటి శిక్షణల ద్వారా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, యడవల్లి సురేష్, జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ వెంకటేష్, స్టేట్ కోఆర్డినేటర్ రవికుమార్, లోకేష్, ఫీల్డాఫీసర్ వంశీకృష్ణ, శివప్రసాద్, రామకృష్ణ, గోపీకృష్ణ, జాకబ్, శీను తదితరులు పాల్గొన్నారు.



పొలం అమ్మబడును

గూడూరు ఆదిశంకర కాలేజీ
ఎదురుగా నేషనల్ హైవేను ఆనుకుని
1కిలోమీటరు రోడ్డు ఫ్రంటేజ్ గల
30 ఎకరాల పొలం అమ్మకానికి కలదు.

మధ్యవర్తుల ద్వారా అమ్మబడదు.

కొనుగోలుదారులు మాత్రమే సంప్రదించగలరు

వివరాలకు: 98400 49850

## 'ప్రభా'తం

# విజయవంతం.. 20 ఏళ్ళ ప్రస్థానం

ఎవరెన్ని విమర్శలు గుప్పించినా నేటికీ మోడీ పట్ల ప్రజల అభిమానం ఏమాత్రం తగ్గలేదు. దేశంలో బిజెపిని శక్తివంతమైన పార్టీగా నిలపడంతో పాటు, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కొరకరాని కొయ్యలుగా మారిన ఎన్నో సమస్యలను మోడీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం అనితరసాధ్యమైన రీతిలో పరిష్కరించిందని, దేశభద్రత కోసం, ప్రజాసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని ప్రజలు మోడీ పరిపాలన పట్ల ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. అందుకే చాయ్‌వాలా దగ్గర నుంచి దేశప్రధాని దాకా మోడీ ఈ ఇరవైఏళ్ళ జీవితప్రయాణం.. రాజకీయ ప్రస్థానం అత్యంత సాహసోపేతమైన విజయగాథగా దేశానికి మార్గదర్శకంగానే ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.



ప్రధాని నరేంద్రమోడీ రాజ్యాంగ పదవిని చేపట్టి అక్టోబర్ 7వ తేది నాటికి అక్షరాలా ఇరవై ఏళ్ళయింది. సరిగ్గా 2001 అక్టోబర్ 7వ తేదిన గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీ పదవిని అధిష్ఠించారు. కనీవినీ ఎరుగని విధంగా పదమూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత భారత ప్రధానిగా ఆయన అత్యున్నతమైన పదవిని పొంది గత ఏడేళ్ళుగా ఆ పదవిలో ఉంటూ దేశంలో ప్రజల ప్రయోజనం కోసం అనేక సంస్కరణలు చేపట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను సగర్వంగా నిలిపారు. అటు ముఖ్యమంత్రిగా, ఇటు ప్రధానమంత్రిగా మోడీ దేశానికి చేసిన, చేస్తున్న సేవలు అపూర్వం. ఎవరెంతగా విమర్శించినా, ప్రతిపక్షాలు మోడీ పాలన పట్ల విముఖత ప్రదర్శిస్తున్నా ఆయన పరిపాలన సుపరిపాలనేనని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కొరకరాని కొయ్యలుగా మారిన ఎన్నో సమస్యలను మోడీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం అనితరసాధ్యమైన రీతిలో అత్యంత సామరస్యంగా, శాంతియుతంగా పరిష్కరించిందని ప్రజలు మోడీ పరిపాలన పట్ల ఎంతో సంతృప్తిని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. మోడీ రాకతో దేశంలో అప్పటిదాకా పాలిస్తూ తమకిక ఎదురే లేదనకున్న కాంగ్రెస్‌పార్టీ అథ:పాతాళానికి పడిపోయింది. కొన్ని రాష్ట్రాల్లో నేటికీ కాంగ్రెస్‌కు కొంత బలం ఉన్నప్పటికీ దేశానికి నాయకత్వం వహించే పరిస్థితిని ఆ పార్టీ కోల్పోయింది. ఇటీవలి కాలంలో మోడీ సారధ్యంలో బిజెపి ఆసేతు హిమాచలం బాగా విస్తరించింది. జనరంజకమైన పథకాలు అమలు చేయడంతో పాటు, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న హిందూ జాతీయ విధానాలు దేశ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటూనే ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు మొదట్లో కొంత విమర్శల పాలైనా క్రమేణా అది మేలైన పరిణామమేనని అందరూ భావించే స్థితి వచ్చేసింది. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో భాగంగా భారత్ తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు, ఒక్క మన దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదంపై పోరుకు ఎంతో ధైర్యసాహసాలతో మోడీ చేస్తున్న ప్రయత్నాలను అగ్రరాజ్యమైన అమెరికాతో పాటు అనేకదేశాలు ప్రశంసిస్తున్నాయి. ఉగ్రవాదంపై ప్రపంచమంతా పోరు సాగించాలన్న మోడీ పిలుపుకు అనేక దేశాలు బాగా స్పందిస్తున్నాయి. భారత్‌లోనూ అనేక సంస్కరణలు మోడీ సుపరిపాలనకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ కాలుష్యం అలుముకుంటున్న వేళ, దేశంలో స్వచ్ఛభారత్‌కు పిలుపునివ్వడం, మనదేశంలోని ప్రాచీన యోగ వైశిష్ట్యాన్ని ప్రపంచవ్యాప్తం చేయడం, సాధారణ ప్రజలకు సైతం అత్యవసరమైన మరుగుదొడ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన చేపట్టడం, ఇరవై కోట్లకు పైగానే జన్‌ధన్ ఖాతాలను ప్రారంభించడం, పేదలకు ఆరోగ్యబీమాను అందజేయడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, బడుగు బలహీనవర్గాలకు చేయూతనందించడం, ఆత్మనిర్భర్‌భారత్‌ను అమలులోకి తేవడం తదితర ఎన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలతో పాటు రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు, అగ్నిగుండంలా ఉన్న కశ్మీర్‌లో మళ్ళీ శాంతిపవనాలు వీచేలా చేయడం, త్రిబుల్ తలాక్ రద్దు, అయోధ్యలో రామాలయం నిర్మాణం, దేశ రక్షణ రంగాన్ని మరెంతో బలోపేతం చేయడం, దేశ భద్రతను సుదృఢం చేయడం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఆట కట్టించడం ఇలాంటివెన్నో మోడీ పట్ల ప్రజల్లో అభిమానాన్ని పెంచాయి. పరిపాలనలో ఎదురయ్యే ఎన్నో రకాల సవాళ్ళను ఆయన అంతులేని ఆత్మవిశ్వాసంతో అధిగమిస్తూనే ఉన్నారు. కొన్ని సందర్భాల్లో విమర్శలు ఎదురైనా తనదైన శైలిలో ధీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతూనే ఉన్నారు. కొత్త సాగుచట్టాలు వద్దంటూ వామపక్షాలు, రైతు నాయకులు ఆందోళనలు చేస్తున్నా.. రైతాంగానికి ఉపయోగపడేందుకే కదా ఆ సంస్కరణలు అంటూ ఆయన ధీమాను ప్రదర్శిస్తూనే ఉన్నారు. అంతేకాదు, పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వంటి నాయకులు మోడీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలని విమర్శల యుద్ధం చేస్తున్నా ఏమాత్రం లెక్కచేయకుండా దేశంలో బిజెపిని మహాశక్తివంతమైన పార్టీగా నిలిపిన ఘనత ప్రధాని మోడీదే. అందులోనూ ఇప్పుడున్న కరోనా కష్టకాలంలో దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో తిరిగి అభివృద్ధి చేసేందుకు, ప్రపంచాన్నే భయపెడుతున్న కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు మోడీ చేస్తున్న పోరాటం అంతులేనిది. సరైన సమయంలో లాక్‌డౌన్ పెట్టి దేశప్రజలు ఆ మాయదారి వ్యాధి బారినపడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడాన్ని ప్రజలంతా ఇప్పటికీ హర్షిస్తూనే ఉన్నారు. కరోనా టీకా విషయంలోనూ మోడీ తీసుకున్న శ్రద్ధ చొరవను దేశప్రజలతో పాటు ప్రపంచమంతా అభినందిస్తూనే ఉంది. అందుకే ఎవరెన్ని విమర్శలు గుప్పించినా నేటికీ మోడీ పట్ల ప్రజలకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదన్నది అందరికీ తెలిసిందే! భారతదేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేస్తున్న ప్రధాని మోడీ దార్శనికత ప్రపంచానికే ఆదర్శంగా ఉంటుండడం విశేషం. 'నా జీవితంలో నేను ప్రధాని అవుతానని నేను ఏనాడూ ఊహించలేదు. ఇదంతా ప్రజల ఆశీర్వాదబలమే' అంటారాయన ఇప్పటికీ ఎంతో వినమ్రంగా. ఆ వినమ్రత, నిరాడంబరత, ఆ నిజాయితీయే ఆయన్ను ప్రజలకు దగ్గర చేసింది. ఏదేమైనా..చాయ్‌వాలా దగ్గర నుంచి దేశప్రధాని దాకా మోడీ ఈ ఇరవైఏళ్ళ రాజకీయ ప్రస్థానం సాహసోపేతమైన ఒక విజయగాథగా దేశానికి మార్గదర్శకంగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఆ జీ.ఓలను రద్దు చేయాలి



## ○ ఏబివిపి ఆందోళన

నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఇబ్బంది కలగజేసే జీవో నెంబర్ 55, 77లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలంటూ ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 9న ఏబివిపి ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఏబివిపి ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక బి.ఎస్.ఆర్ సెంటర్లో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తూ నిరసనకు దిగారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బంది కలగజేసే జీవోలను వెంటనే రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల గ్రామీణ, పేద, బలహీనవర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య శాశ్వతంగా దూరమవుతోందని ఈ జి.ఓలను వెంటనే ఉపసంహరించుకోవాని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబిఐపి సంఘ నేత అశోక్, ఏబివిపి నగర కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శులు నవీన్, ప్రకాష్, కళామంచ్ కన్వీనర్ ధనుష్, విద్యార్థి నాయకులు ఇర్ఫాన్, నవీన్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ అధ్యాపకుడు.. మోపూరు వేణుగోపాలయ్య

ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య సంస్మరణ సభ ఇటీవల నెల్లూరు మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సాహితీవేత్తగా, అధ్యాపకునిగా మోపూరు వేణుగోపాలయ్య ఆదర్శవంతమైన మార్గంలో నడిచి అందరికీ మార్గదర్శకులయ్యారన్నారు. సరస్వతీ సమాజం అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. నెల్లూరు వేద సంస్కృత కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు డా.గిరిజాలక్ష్మి, రాజీయాడ్స్ మోపూరు పెంచలయ్య, సరస్వతీ సమాజం కార్యదర్శి టి.రమణయ్య, మాల్యాద్రి, హరి, మోహన్, శ్రీధర్, బాబులురెడ్డి, శ్రీకాంత్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.




## విశ్వోదయ, జవహర్‌భారతిలను

# కొనసాగించాలి

వేలాదిమంది పేద విద్యార్థులకు విద్యాభిక్ష పెట్టిన కావలిలోని విశ్వోదయ, జవహర్‌భారతి విద్యాసంస్థలను ఎయిడెడ్ విద్యాసంస్థలుగా కొనసాగించాలని కావలి ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది పేద విద్యార్థులు ఇప్పుడు సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్నారని, అలాంటి ఉత్తమ విద్యాసంస్థలను నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనుకోవడం దారుణమన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థల పరిరక్షణ కోసం విద్యార్థులంతా కలసి పోరాటం చేద్దామన్నారు.

తొలుత విద్యార్థులంతా కలసి జవహర్‌భారతి విద్యాసంస్థల వద్ద ఆందోళన చేశారు. ఎస్‌ఎఫ్ఐ నాయకులు శరత్, ప్రణయ్, కార్తీక్, మల్లి, పూర్వ విద్యార్థులు వెంకటరమణయ్య, మాల్యాద్రి, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు వేగంగా నడపొద్దు...

# ప్రాణాలకు ప్రమాదం తెచ్చుకోవద్దు




వాహనాలు వేగంగా నడపడం వల్ల నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు నుజ్జునుజ్జుగా మారి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. మరెందరో గాయాలకు గురై బాధలు పడుతున్నారు. దీని వల్ల ఆయా కుటుంబాల వేదన అంతా ఇంతా కాదు. జిల్లాలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా మితిమీరిన వేగమే ప్రమాదాలకు కారణమవుతోంది. ప్రమాదాలకు గురైనవారు, ప్రమాదాలకు కారణమైనవారు ఇరువురూ ఈ ఘటనల వల్ల ఎంతో నష్టపోతున్నారు కూడా. అయినా ప్రమాదాలు మాత్రం తగ్గడమే లేదు. ఇకనైనా ఎవరికి వారే ఈ విషయాల పట్ల బాగా ఆలోచించుకోవాలి. ప్రమాదాలను మనకు మనమే నివారించుకోవాలి. రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మితిమీరిన వేగాన్ని నియంత్రించుకోవడం, జాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారా కొంతలో కొంత భద్రంగా ఉండేందుకు అవకాశం ఉంది. మద్యం సేవించి వాహనాలు నడపడం, నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం వంటివి ప్రాణాంతకమేనన్న విషయం మరిచిపోకూడదు. వాహనాలు నడిపే సందర్భంలో ముఖ్యంగా రోడ్ల మలుపుల వద్ద మరీ జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రివేళ, వేకువ సమయంలో నిద్రావస్థలో వాహనాలు నడిపితే ప్రాణాలకే ప్రమాదం. మనం ఎంత బాగా డ్రైవ్‌చేస్తున్నా, ఎదురొచ్చే వాహనమో, లేక వెనకొచ్చే వాహనమో ఢీకొంటే చేసేదేమీ ఉండదు. వాళ్ళు కూడా సరైన రీతిలో వాహనాలు నడిపితే ఈ బాధలుండవు. రోడ్లమీద మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోకుండా ట్రాఫిక్ నిబంధనలు అనుసరిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవాలి. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టుకోవాలి. అందువల్ల మనకే మంచిది. ట్రాఫిక్ పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు కూడా ఈ విషయాలపై మరింతగా దృష్టిపెట్టి రోడ్డుప్రమాదాలు జరగకుండా పటిష్టవంతమైన చర్యలు తీసుకోవాలి. జిల్లావ్యాప్తంగా మరమ్మతులకు గురై ఉన్న రోడ్లను గుర్తించి వాటిని బాగుచేసేందుకు ఇకనైనా గట్టి చర్యలు తీసుకోవాలి. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడంతా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం ద్వారా ప్రమాదాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవడం వల్ల కొంతమేరకైనా ప్రమాదాలు తగ్గే వీలుంటుంది.

*ఆర్.వి.కె శేఖర్‌బాబు,* **రాజుపాలెం.**

## ముఖ్యమంత్రి జగన్ పథకాలతో..

# మహిళలకు ఆర్థికాభ్యున్నతి

## - మంత్రి డాక్టర్ అనిల్

మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. ఇటీవల నెల్లూరు లోని ఎంసిఆర్ కల్యాణమండపంలో ఆయన 'వైఎస్సార్ ఆసరా' పథకం రెండో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఇళ్ళ నిర్మాణాలు పెద్దఎత్తున ప్రారంభ మయ్యాయని, అయితే టిడిపి నాయకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని అడ్డంకులు పెట్టినా పేదలకు ఇళ్ళు నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. వైఎస్సార్ ఆసరా ద్వారా పొదుపు మహిళ లకు రుణాలను మాఫీచేసిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కు తుందన్నారు. టిడ్కో ఇళ్ళను కూడా మహిళ లకు ఉచితంగా దశలవారీగా అందజేసే ప్రక్రియకు కూడా శ్రీకారం చుట్టామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు



కళ్ళుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నెల్లూరు నగరాన్ని స్వచ్ఛ నెల్లూరుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ప్లాస్టిక్ కవర్లు వగైరాలను వాడకుండా స్వీయ నియంత్రణ పాటించి నెల్లూరును ప్లాస్టిక్ రహిత నగరంగా నిలపాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ జలవనరులశాఖ మంత్రిగా డా.అనిల్‌కుమార్‌యాదవ్ జిల్లాకు ప్రాతి నిధ్యం వహిస్తుండడంతో జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించుకోగలుగుతున్నామన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు మంత్రి డా.అనిల్ ఎంతగానో సహకరిస్తున్నారని కొనియాడారు. అనం తరం నెల్లూరు అర్బన్ పరిధిలోని 1,555 మంది స్వయం సహాయక గ్రూపు సభ్యులకు సుమారు 17.44 కోట్ల రూపాయల మెగా చెక్కును మంత్రి, కలెక్టర్ కలిసి అంద జేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆసరా రోజ్‌మాండ్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ కొలనుల అభివృద్ధికి నిధులు

## రాపూరు ఎర్రచెరువు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనం, కలెక్టర్

రాపూరు వద్ద ఉన్న ఎర్రచెరువును ఆహ్లాదకరమైన రీతిలో అభివృద్ధి చేసేం దుకు ప్రారంభించిన పనులను ఈనెల 12న వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారా యణరెడ్డి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనం మాట్లాడుతూ వెంకటగిరి నియో జకవర్గం పరిధిలో 6 గ్రామ కొలనుల సుందరీకరణ చేపట్టనున్నామని, అందుకు సవరించిన అంచనాలను జిల్లా కలెక్టర్ ఆమోదించి మంజూరు చేశారని చెప్పారు. సవరించిన అంచనాల ప్రకారం బాలాయ పల్లి మండలంలోని మన్నూరు గ్రామ కొలనుకు 51.38 లక్షలు, డక్కిలి గ్రామ కొలనుకు 91.09 లక్షలు, కలువాయి మండలంలోని పర్లకొండ గ్రామ కొలనుకు



78.25 లక్షలు, రాపూరు ఎర్రచెరువుకు కోటీ 5 లక్షలా 13 వేల రూపాయలు, సైదాపురం గ్రామ కొలనుకు 56.56 లక్షలు, వెంకటగిరి మండలంలోని వల్లివేడు గ్రామ కొలనుకు 97.47 లక్షలు మొత్తంగా 4 కోట్లా 79 లక్షల 88 వేల రూపాయల నిధులు మంజూరయ్యాయ న్నారు. ఈ పనులన్నిటినీ త్వరితగతిన పూర్తిచేయాలని వారు ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

# అజీజ్ సేవలు అభినందనీయం



## - టిడిపి నేత బీద రవిచంద్ర

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ పార్టీకి చేస్తున్న సేవలు అభినందనీయమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కొనియాడారు. టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజక వర్గానికి తొలి అధ్యక్షుడుగా అజీజ్ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 9న నెల్లూరులోని టిడిపి కార్యా లయంలో జరిగిన కార్యక్రమంలో 60 కిలోల కేకు కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ అజీజ్ అందరినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీని సమర్ధవంతంగా నడిపిస్తున్నారని, పార్టీ అభ్యున్నతికి ఎంతగానో కృషిచేస్తున్నారని అభినందించారు. పార్టీ కార్యకర్తలకు ఏ ఇబ్బంది కలిగినా తానున్నానంటూ వారికి భరోసా కల్పించేవారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అజీజ్ రాజకీయాల్లోకి వచ్చి ఆర్ధికంగా ఎంతో నష్టపోయారని అంటూ రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో జిల్లాలోని పది నియోజకవర్గాల్లో టిడిపి జెండా రెపరెపలాడబోతోందని జోస్యం చెప్పారు. అనంతరం అజీజ్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త తన కుటుంబసభ్యునితో సమానమన్నారు. అధికారపక్షాన్ని నిల దీయడంలో పార్టీ కార్యకర్తల పోరాటం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, కిలారి వెంకటస్వామినాయుడు, జెన్ని రమణయ్య, బొమ్మి సురేంద్ర, జలదంకి సుధాకర్, సాబిర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మొన్న 'డైకిన్', నిన్న 'బ్లూస్టార్', నేడు 'యాంబర్'

# శ్రీసిటీకి తరలివస్తున్న ఏసీ కర్మాగారాలు




శ్రీసిటీకి ఒకదాని వెంట మరొకటిగా పెద్దపెద్ద ఏసీ కర్మాగారాలు తరలివస్తున్నాయి. మొన్న 'డైకిన్', నిన్న 'బ్లూస్టార్' పరిశ్రమలు రాగా, ఇప్పుడు తాజాగా రూమ్ ఎయిర్ కండీషనర్లు, విడిభాగాల తయారీలో పేరుగాంచిన యాంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఇటీవల శ్రీసిటీలో తమ నూతన పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేసింది. ఈ సంస్థకు ఇది దేశంలో 15వ ప్లాంట్ కాగా, దక్షిణ భారతదేశంలో మొదటిది. ఈ పరిశ్రమలో ప్రధానంగా ఏసీలు, ఏసీ విడిభాగాలు ఉత్పత్తిచేసి, దేశంలోని 20కుపైగా ఏసీ కంపెనీలకు సరఫరా చేయనున్నారు. డైకిన్, బ్లూస్టార్, యాంబర్ వంటి వరుస ఏసీ కంపెనీలతో ఏసీల తయారీ రంగంలో శ్రీసిటీలో సరికొత్త వ్యాపా రానుకూల వ్యవస్థ రూపుదిద్దుకుంటూ మరిన్ని కంపెనీలను ఆకర్షిస్తుండడం విశేషం.

# శ్రీసిటీలో సీనియర్ ఐఏఎస్ అధికారులు





కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి దుర్గా శంకర్ మిశ్రా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ ఈ నెల 9న విడివిడిగా శ్రీసిటీని సందర్శించారు. దుర్గా శంకర్ మిశ్రాకు శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలు వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను మిశ్రా సందర్శించారు. కొన్ని పరిశ్రమలకు వెళ్ళి అక్కడ ఉత్పత్తులను, ఇతర పనులను పరిశీలించారు. శ్రీసిటీ పారిశ్రామిక అభివృద్ధి పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, భారీ ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీని అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్యం చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారు.

శ్రీసిటీకి విచ్చేసిన పోలా భాస్కర్‌కు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఘనస్వాగతం పలికారు. తన పర్యటనలో భాగంగా ఆయన క్రియా యూనివర్సిటీని సందర్శించారు. క్రియా వైస్ ఛాన్సలర్ డాక్టర్ మహేశ్ రంగరాజన్, గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మరియు స్కూల్ ఆఫ్ ఇంటర్‌వూవెన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విభాగాల అధ్యాపకులతో ఆయన చర్చించారు. ఉన్నత విద్యలో భిన్నమైన విధానాన్ని తీసుకువచ్చినందుకు యూనివర్సిటీ బృందాన్ని ప్రశంసించారు.

# మాదనపాలెం హైస్కూల్‌కు స్మార్ట్ బోర్డు



శ్రీసిటీ ఫౌం డేషన్ చొరవతో శ్రీసిటీలోని యూఎస్జీ బొరెల్ పరిశ్రమ యాజ మాన్యం మండ లంలోని మాదన పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 1.10 లక్షల రూపాయల విలువైన స్మార్ట్ బోర్డును ఇటీవల స్కూల్ ప్రధానోపాధ్యాయులుకు అందజేశారు. అనంతరం దానిని తరగతి గదిలో అమర్చి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూఎస్జీ బొరెల్ ప్లాంట్ డైరెక్టర్ సునిల్ షెకావత్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీ ప్రతినిధి నిరీషా తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో

# మంత్రుల పూజలు



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 10న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో కొలువై ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి వెళ్ళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వాసవీమాత అనుగ్రహం ఉందన్నారు. మంత్రి అనిల్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో ఎంతో వైభవంగా పూజలు చేస్తున్నారని, ప్రజలకు ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థిస్తున్నామని అన్నారు. ఆలయ గౌరవాధ్యక్షులు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు ఆలయ కమిటీవారు ఆలయానికి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా మంత్రులు అభినందించారు. తొలుత ముక్కాల ద్వారకానాథ్ మంత్రులకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించి వేదాశీర్వచనాలు పలికారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సుంకు మనోహర్, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి రామచంద్రరావు, కోట సూర్యనారాయణ, పేర్ల సీతారాం, మేడా కామేశ్వరరావు, పాదర్తి బాలాజీతో పాటు పలువురు ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాథస్వామికి.. వెండి కలశాల వితరణ



నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి విజయవాడకు చెందిన దిలీప్‌కుమార్ కుటుంబసభ్యులు 2.086 కేజీల బరువైన 10 వెండి కలశాలను బహుకరించి స్వామివారి పట్ల తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈనెల 11న రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథాలయంలో వారు స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, ఆలయ ఛైర్మెన్ ఇలపాక శివకుమార్‌ఆచారిలకు ఆ కలశాలను అందజేశారు.

## 17 దాకా కాలేజీలకు..దసరా సెలవులు

దసరా పండుగను పురస్కరించుకుని జూనియర్ కాలేజీలకు ఈనెల 10 నుంచి 17వ తేదీ దాకా ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని, ఈ పండుగ సెలవుల రోజుల్లో ఎవరైనా తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐఓ వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న కళాశాలలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు.

## గుండెపోటుతో ఎస్‌బి ఎస్ఐ కన్నుమూత

జిల్లా పోలీసుశాఖలో స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తున్న జి.భాస్కర్‌రావు ఇటీవల గుండెపోటుతో కన్నుమూశారు. నెల్లూరులోని తెలుగుగంగ కాలనీ వద్ద ఆయన నివాసం ఉండేవారు. 1983లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరి, జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో కానిస్టేబుల్‌గా, హెడ్‌కానిస్టేబుల్‌గా, ఏఎస్ఐగా విధులు నిర్వహించారు. 2018లో ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొంది స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో భాస్కర్‌రావు గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. ఈనెల 9వ తేదీ వేకువన గుండెపోటుకు గురై మరణించారు. ఆయన భౌతిక కాయానికి ఏఎస్పీ వెంకటరత్నం, ఎస్‌బి డిఎస్పీ కోటారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అక్కేశ్వరరావు, రామకృష్ణ, నరసింహారావు తదితరులు నివాళులర్పించారు. భాస్కర్‌రావు భార్య కూడా ఏడాది క్రితం మృతిచెందారని, వీరికి ఇద్దరు పిల్లలున్నారని, వారికి తామంతా అండగా ఉంటామని ఏఎస్పీతో పాటు పోలీసు అధికారులు ఈ సందర్భంగా వారికి భరోసా ఇచ్చారు.

# నెల్లూరు కబుర్లు

### శ్రమదానం చేద్దాం..

## నగరాన్ని బాగుచేసుకుందాం

### కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్



శ్రమదానం చేసుకునైనా సరే, మన ఊరును, మన ప్రాంతాన్ని బాగు చేసుకుందామని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 11న ఆయన నగరంలోని జిల్లా ఎస్పీ నూతన కార్యాలయం వద్ద నుంచి నెల్లూరు నగర చెరువుగట్టున ఉన్న ఇరుకళలమ్మ అమ్మవారి దేవాలయం వరకు సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమదానంలో స్వచ్ఛంధసంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. మన ఊరును పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శెట్టిగుంటరోడ్డులో 'స్వచ్ఛమాత'



పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి చేస్తున్న సేవలు అమూల్యం. కోవిడ్ కష్టకాలంలో వారు తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా వీధులను, పరిసరాలను పరిశుభ్రం చేస్తూ సమాజానికి సేవలందిస్తున్నారు. అలాంటి సమాజసేవకులను ఎల్లవేళలా గుర్తుంచుకునే విధంగా నెల్లూరులో 'స్వచ్ఛమాత' పేరుతో పారిశుద్ధ్య కార్మికురాలి విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతైనా విశేషం. నెల్లూరు, 6వ డివిజన్ పరిధిలోని శెట్టిగుంటరోడ్డులో ఉన్న ఐలాండ్ సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ఆ విగ్రహాన్ని నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్‌తో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.అనిల్‌కుమార్‌యాదవ్ ఇటీవల ఆవిష్కరించారు. నగరాన్ని పరిశుభ్రం చేసే పారిశుద్ధ్యకార్మికుల సేవలకు గుర్తింపుగా స్వచ్ఛమాత విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, వైకాపా నాయకులు మద్దినేని శ్రీధర్, సత్యకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగం వద్దనే వద్దు



నెహ్రూ యువకేంద్ర – నెల్లూరు వారి ఆధ్వర్యంలో, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీ నెల్లూరులోని వేదాయపాలెం రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను, ప్లాస్టిక్ కవర్లు వగైరాలను వాడవద్దని, వాటి స్థానంలో గుడ్డ సంచులు, జ్యూట్‌బ్యాగ్‌లు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్ర అధికారి మహేంద్రరెడ్డి ప్రజలకు సూచించారు. ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ దాకా నెహ్రూ యువ కేంద్రాల అనుబంధ సంస్థల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టామని ఆయన చెప్పారు. వలంటీర్లు, రైల్వే ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



## డెప్యూటీ స్పీకర్‌ను కలిసిన కలెక్టర్

ఈనెల 10న తిరుపతికి రోడ్డుమార్గాన వెళ్తూ దారిలో నెల్లూరులో ఆగిన డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతిని నెల్లూరు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు గౌరవపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ కూడా ఉన్నారు.

## గొప్ప పరిశోధకుడు.. బంగోరె



నెల్లూరుకు చెందిన బంగోరె (బండి గోపాలరెడ్డి) తెలుగు భాషా సాహిత్య పరిశోధకునిగా, మంచి విమర్శకునిగా పేరొందారని, పాత్రికేయునిగా కూడా రాణించారని, ఆయన సాహితీసేవలు చిరస్మరణీయమని విక్రమసింహపురి యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి అన్నారు. ఈనెల 12న బంగోరె జయంతి సందర్భంగా విఎస్‌యులోని శ్రీ పొట్టి శ్రీరాములుభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బంగోరె పరిశోధనల్లో ఎంతో విశిష్టమైన సిపి బ్రౌన్, వేమన, కట్టమంచి రామలింగారెడ్డి, కందుకూరి రచనలు వంటివి ఉన్నాయని వివరించారు. తొలుత బంగోరె చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. విఎస్‌యు కళాశాల ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, డా.పి.సుబ్బరామరాజు, తెలుగుశాఖ అధ్యాపకులు రాజారాం, లక్ష్మీనారాయణరెడ్డి, విమల, వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్, పరీక్షల నియంత్రణ అధికారి సాయి ప్రసాద్‌రెడ్డి, సహాయక రిజిస్ట్రార్ సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

## లస్సీ సెంటర్‌లో.. అగ్నిప్రమాదం

○ లక్షల్లో ఆస్తి నష్టం



నెల్లూరు ట్రంకురోడ్డులో ఉన్న లస్సీసెంటర్‌లో ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మూడు షాపులు అగ్నికి ఆహుతి కావడంతో ఆస్తినష్టం లక్షల్లోనే ఉంటుందని అంటున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. అఖిల్ మొబైల్‌షాప్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయని, దీంతో పక్కనే ఉన్న మందులషాపు, ఫుట్‌వేర్ షాప్‌లకు కూడా మంటలు వ్యాపించాయనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పెద్దప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనలో 16.70 లక్షల రూపాయల దాకా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఆకట్టుకొన్న బొమ్మల కొలువు

దసరా శరన్నవరాత్రి సంబరాల్లో భాగంగా నెల్లూరులోని రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు ఆ స్కూల్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ బాగా ఆకట్టుకుంది. ప్రత్యేకించి శివలింగం నమూనా ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా పూజలు చేసి బొమ్మల కొలువును ప్రారంభించారు. స్కూల్ డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యంతో పాటు ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


## 5 కోట్ల రూపాయల నోట్లతో.. స్వర్ణాభరణాల ధగధగలతో

# ధనలక్ష్మీ దేవిగా.. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి

### నెల్లూరులో అత్యద్భుతంగా దేవీనవరాత్రుల ఉత్సవాలు







***ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఈసారి నవరాత్రి వేడుకల్లో దేదీప్యమానమైన అలంకరణలు చేయిస్తూ ఆలయ ధర్మకర్తల మండలి సారధ్యంలో నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు ఆర్యవైశ్య ప్రముఖులంతా తాము నిత్యం ఎంతో భక్తితో కొలిచే అమ్మవారి సేవలో తరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా, రాష్ట్రంలోనే మరెక్కడా జరగని విధంగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీమాత ఆలయం ఇప్పుడు దేదీప్యమానంగా వెలుగొందుతోంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిసారిగా కోట్లాది రూపాయల కరెన్సీ నోట్లతో, బంగారు ఆభరణాలతో అమ్మవారికి ధనలక్ష్మీదేవి అలంకారాన్ని శోభాయమానంగా అలంకరించి ఆలయ నిర్వాహకులు అందరి అభిమానానికి పాత్రమవుతున్నారు.***

కోట్లకొద్దీ నోట్లతో.. భారీ బంగారు ఆభరణాల ధగధగలతో నెల్లూరు స్టోన్ హౌస్‌పేటలో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు దేదీప్యమానంగా ప్రకాశించడంతో భక్తుల ఆనందానికి అవధుల్లేవు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్యులకు ఆరాధ్యదైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కనీవిని ఎరుగని రీతిలో అంగరంగవైభవంగా అమ్మవారి అలంకరణలు, ప్రత్యేకపూజలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో 5వ రోజైన ఈనెల 11వ తేది సోమవారం నాడు అమ్మవారికి ప్రత్యేకించి ధనలక్ష్మీదేవి అలంకారాన్ని శోభాయమానంగా నిర్వహించారు. దాదాపు అయిదు కోట్ల రూపాయల కరెన్సీ నోట్లతో, 7 కిలోల బంగారు ఆభరణాలు, మరో 60కిలోల వెండి ఆభరణాలతో అమ్మవారిని అత్యద్భుతంగా అలంకరించి సాక్షాత్తూ ఆ ధనలక్ష్మీదేవే ఇక్కడ ప్రత్యక్షమైందా అన్నంత రీతిలో వైభవోపేతంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారిని అలంకరించడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ దాదాపు 130 సంవత్సరాల చరిత్రగల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఇటీవలే దాదాపు 11 కోట్ల రూపాయల వ్యయంతో సర్వాంగసుందరంగా పునర్నిర్మించడం జరిగిందని, ఇప్పుడు రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా అమ్మవారికి కోట్లాది రూపాయల కరెన్సీతో, బంగారు వెండి ఆభరణాలతో ధనలక్ష్మీదేవి అలంకారం చేయించడం జరిగిందన్నారు. అమ్మవారి కృపాకటాక్షలు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న వారంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ధనలక్ష్మీదేవి అలంకారంలో ప్రకాశిస్తున్న అమ్మవారిని ఎంతో భక్తిశ్రద్ధలతో దర్శించుకుని తరించారు.

# ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలోని సివిల్ విద్యార్థులకు ఇటీవల ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. అమెరికాలోని టెక్సాస్ నగరం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న సివిల్ విభాగానికి చెందిన కంపెనీ ఇన్నోవుస్ టెక్ సొల్యూషన్స్ అనే సంస్థ 2019-20-21 సంవత్సరాల్లో బీటెక్ చదివిన విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. పెద్దపెద్ద భవనాల నిర్మాణాల్లో ఈ టెక్నాలజీ వినియోగిస్తారని సంస్థ ప్రతినిధి సతీష్ తెలిపారు. అమెరికాలోని టెక్సాస్‌తో పాటు భారతదేశంలో పూనెలో, ఇటీవల హైదరాబాద్‌లో కూడా తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు.

ఈ కార్య క్రమంలో కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకై నిరీక్షిస్తున్న తరుణంలో కోర్ కంపెనీలు తమ కళశాలకు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకోవడం మంచి పరిణామమని సంతోషం వ్యక్తం చేశారు. ప్రాంగణ ఎంపిక అధికారి డా. ఎన్. కిషొందర్ మాట్లాడుతూ మొత్తం 40 మంది విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరయ్యారని, వీరికి పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని,



ఎంపికైన విద్యార్థులకు వార్షికవేతనం 2.2 లక్షల దాకా ఉంటుందని తెలిపారు. సివిల్ విభాగాధిపతి డా. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మ దేవాలయంలో.. నిత్యాన్నదానానికి విరాళం



సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి సర్వారెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన మారంరెడ్డి నరహరిరెడ్డి కుటుంబసభ్యులు ఇటీవల లక్షా ఒక వెయ్యి నూటపదహారు రూపాయలు విరాళం చెక్కును ఆలయ ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేకపూజలు చేసి దాతలకు అమ్మవారి ఆశీస్సులను అందజేశారు.






# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కిలివేటి

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఈనెల 11న రేణిగుంటలోని విమానాశ్రయం వద్ద సూళ్ళూరుపేట ఎమ్మెల్యే, టిటిడి పాలకమండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తిరుపతిలోని అలిపిరి వద్ద గోమందిరం ప్రారంభోత్సవం మొదలుకొని సిఎం పాల్గొన్న అన్ని కార్యక్రమాల్లోనూ ఆయనతో కలిసి కిలివేటి పాల్గొన్నారు.

# పొదుపు మహిళల అభ్యున్నతికి 'ఆసరా'

### కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'వైఎస్సార్ ఆసరా' పథకం పొదుపు మహిళల ఆర్థికాభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతుందని, ఇదొక మంచి పథకమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 10న ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో వవ్వేరు బ్యాంక్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగాలేకపోయినా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమలుచేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలు అమలుచేస్తూ ప్రజలందరి అభిమానాన్ని పొందుతున్నారని కొనియాడారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తూ, ప్రజల సంక్షేమానికి అన్ని రకాల పథకాలను ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారన్నారు. రాష్ట్రానికి జగన్ శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని మహిళామణులంతా కోరుకుంటున్నారని ఆయన అంటూ మహిళలు ఆసరా పథకాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలోని 1035 పొదుపు గ్రూపులకు 9.15 కోట్ల రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఆ మేరకు నమూనా చెక్కును ఆయన ఆవిష్కరించారు. ఏపిఎం లలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, డిఏఏబి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, డిఎల్‌డిఏ ఛైర్మెన్ విజయకుమార్, వవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, బుచ్చి సొసైటీ ఛైర్మెన్ మేనకూరు సీతారామిరెడ్డితో పాటు వైకాపా నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు జిల్లా పరిషత్ నూతన ఛైర్‌పర్సన్‌గా ఇటీవల ఎన్నికైన ఆనం అరుణమ్మ - ఆనం విజయకుమార్‌రెడ్డి దంపతులను ఈ నెల 12వ తేదీ జడ్పీ ఛైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్న నెల్లూరు మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్.


# యథా అధినేత... తథా ప్రభుత్వ యంత్రాంగం!

'ఈ ప్రభుత్వానికి సిగ్గు లేదు ...!'
'ఈ ప్రభుత్వానికి శరం లేదు ...!'
'ఈ ప్రభుత్వానికి బుద్ధి లేదు ...!'
'ఇదొక దిక్కుమాలిన ప్రభుత్వం ...!'
'ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదు ...!'
'ఇదొక ఫ్యాక్షన్ ప్రభుత్వం ...!'
'ఇదొక దుర్మార్గపు ప్రభుత్వం ...!'
'ఇదొక నీతిమాలిన ప్రభుత్వం ...!'

దేశంలో గానీ, రాష్ట్రాలలో గానీ ప్రతిపక్ష పార్టీల వారు మామూలుగా రొటీన్‌గా... తామంతా ప్రభుత్వ వ్యవహారశైలిపై వాడే భాష ఇది. మనం ఏరోజు పేపర్(సాక్షి కాకుండా) తిరగేసినా... ఇటువంటి వాక్యం లాంటి వాక్యం ఒక్కటన్నా కనిపిస్తుంది ఆంధ్ర పత్రికలలో. అవునా?

ఇక, అధికారపార్టీ వారయితే.. 'ప్రభుత్వానికి అన్ని విషయాలూ తెలుసు...'
'ప్రభుత్వం తప్పకుండా ఆలోచిస్తుంది ...'
'మీ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెడతాం...'
'ఇది రైతు పక్షపాత ప్రభుత్వం ....'
'ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం'
'ప్రభుత్వం ఎంతటి వారినైనా వదలదు. కఠిన చర్యలు తీసుకుంటుంది...' ఇదీ అధికారపక్ష సభ్యుల వరుస.

నిజానికి, 'ప్రభుత్వం' అనేదానికి ఒక అస్తిత్వం లేదు. రూపురేఖలు ఉండవు. కంటికి 'ఇదీ' అంటూ ఏమీ కనపడదు. అందుకే, ఒకసారి కడుపు బాగా మండిన సందర్భంలో 'కేంద్రం అనేది ఓ మిధ్య' అని ఎన్.టి.రామారావు ఆక్రోశించారు. కేంద్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వమూ ఓ మిధ్యే. కాకపోతే, 'కేంద్ర ప్రభుత్వం' అనే భావన మొత్తం దేశానికి కర్ర పెత్తందారు అయితే, 'రాష్ట్ర ప్రభుత్వం' అనే భావన రాష్ట్ర పెత్తందారు.






'ప్రభుత్వం' అనే భావనకు అస్తిత్వం ఏమీ లేకపోయినా, ఆ పదం తెలియని వారు ఉండరు. ఇది ప్రభుత్వ స్థలం.. ప్రభుత్వాధికారి.. ప్రభుత్వ కార్యాలయం.. ప్రభుత్వ భవనం.. వంటి పదాలు అన్నీ మనకు నిత్య వాడుకలోనివే.

ఇంతకీ, 'ప్రభుత్వం' అంటే ఎవరు? ఏమిటి? ఎలా?

మనం కలెక్టర్ గారికి ఒక అర్జీ /వినతి పత్రం ఇచ్చామనుకోండి... "మంచిది. మీ రిప్రెజెంటేషన్‌ను ప్రభుత్వానికి పంపిస్తా" అంటారు. మన ఇంటి పక్కనుండే ఎం.ఆర్.ఓ ఆఫీస్ వాళ్ళ దగ్గరి నుంచి చీఫ్‌సెక్రటరీ వరకు ఇదే సమాధానం. 'ప్రభుత్వ దృష్టికి తీసుకు వెడతాము' అని.

ప్రభుత్వం అనేది ఓ కర్ర పెత్తందారు. మనుషులు పుట్టినప్పుడు పుట్టింది, ఈ పెత్తందారీ తనం. మనుషులు జీవనం సాగించే భౌగోళిక ప్రదేశం అనేది.... ఒక సమాజం అయితే.. ఆ భౌగోళిక ప్రదేశాన్ని 'పౌర సమాజం' అంటాము కదా! ఈ పౌర సమాజంలో అరాచకం ప్రబలకుండా... ఒకరిని ఒకరు భక్షించకుండా కొన్ని కట్టుబాట్లు, పద్ధతులు, విధానాలు రూపొందించి నిర్దేశించే ప్రక్రియ పేరే ప్రభుత్వం. ఈ నిర్దేశనకు పర్యాయ పదమే చేతిలో కర్ర. దాని పేరే ప్రభుత్వం.

ఆటవిక మనుషుల కాలంలోనూ వారికి ఓ నాయకుడు ఉంటే... అతనే వారి ప్రభుత్వం. అతను చెప్పినట్టు వారు వినాల్సిందే. రాజుల కాలంలో రాజు మాటే శాసనం. అంటే ప్రభుత్వం. ఆటవిక జీవనం రోజుల నాటి నుంచి సవాలక్ష మార్పులు, చేర్పులతో ఈ 'ప్రభుత్వం' అనేది కొనసాగుతూ వస్తున్నది.

దానిని నిర్వహించే వ్యక్తులు మారుతుంటారు గానీ, అది శాశ్వతం. సత్యం. నిత్యం. సర్వాంతర్యామం. కలి యుగాంతం వరకూ శోభిల్లుతూనే ఉంటుంది. అయితే ట్రంపూ..., కాకపోతే బైడెనూ. అంతే తేడా!

ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల జాతుల మధ్య జరుగుతూ వస్తున్న కుట్రలు, కుతంత్రాలు, యుద్ధాలు, దోపిడీలు, మోసాలు, దురాక్రమణలు, చిరునవ్వులూ, ముద్దులూ, గుద్దులూ... మొదలైనవన్నీ కూడా ఆ ప్రాంత ప్రజలను నియంత్రించే వ్యవస్థ(ప్రభుత్వాన్ని)ను స్వాధీనం చేసుకోడానికే. దానిపై స్వారీ చేయడానికే!

ఈ వ్యవస్థ నిర్వహణకు వివిధ స్థాయిలలో కొందరు వ్యక్తులు అవసరమవుతారు కదా! వారే అధికారులు.., పోలీసులు. గ్రామంలో వీఆర్‌ఓ నుంచి రాష్ట్ర ప్రధానకార్యదర్శి వరకు.. ఈ ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వాములు. వ్యవస్థ సక్రమంగా కొన్ని కట్టుబాట్లతో... ఒక క్రమపద్ధతిలో నడవడానికి కొన్ని చట్టాలు, నిబంధనలు ఏర్పరిస్తే, వాటికి లోబడి సమాజంలో అరాచక పరిస్థితులు తలెత్తకుండా వీరు విధులు నిర్వహిస్తూ ఉంటారు. ఈ వ్యవస్థలు గతంలో రాజులు, జమీందారులు, నవాబులు, నియంతల మనోభీష్టాలకు లోబడి పరిపాలన సాగిస్తే, మన దేశంలోని 'ప్రభుత్వాన్ని' ఆంగ్లేయులు(దోచుకున్నంత వరకు చాలులే అనుకుని) మనకే అప్పజెప్పి వెళ్లిపోయారు. ఇక అప్పటినుంచి తెల్లదొరలు పోయి మన నల్లదొరలు..., కాదు –కాదు – కారు, తారు నలుపు దొరలు వచ్చారు. 'పాలకులు' మాత్రమే మారారు కానీ, ప్రభుత్వ 'క్యారెక్టర్' మారలేదు. 'ప్రభుత్వం' మాత్రం అదే.

అయితే మనం మాత్రం – 'ఆయన ప్రభుత్వం పడిపోయింది'..., 'ఈయన ప్రభుత్వం వచ్చింది' అని మాట్లాడుకుంటుంటాం. మీడియా కూడా అలాగే రాస్తుంటుంది. ప్రభుత్వం అదే. కాకపోతే, దానికి నాయకత్వం వహించే 'నల్లదొర' మారుతుంటారు. ఆయన దిగిపోవాల్సి వస్తే, ఆయన స్థానంలో ఈయన వస్తారు.

ఆ వచ్చినాయన 'మానసిక స్థితి'కి ఆ ప్రభుత్వ యంత్రాగపు వ్యవహారశైలి అద్దం పడుతూ ఉంటుంది. ఆయన దయగల తండ్రి అయితే, ప్రభుత్వ యంత్రాంగం కూడా ప్రజల పట్ల ఔదార్యంతో, ప్రేమతో, బాధ్యతతో, సానుకూల దృక్పథంతో, విశాల హృదయంతో అధికార యంత్రాంగం వ్యవహరిస్తూ ఉంటుంది. ప్రభుత్వానికి నేతృత్వం వహించే వ్యక్తి క్రూర స్వభావుడు, దుష్టుడు... అయితే, ఆయన నేతృత్వంలోని ప్రభుత్వ యంత్రాంగం కూడా పౌరులపై, సమాజంపై విరుచుకుపడుతూ ఉంటుంది. మాట వరుసకు, శ్రీశ్రీశ్రీ చిన జీయర్‌స్వామి వారు 'ప్రభుత్వా'నికి నేతృత్వం వహిస్తున్నారనుకోండి. ప్రభుత్వ యంత్రాంగం అంతా కాషాయ వస్త్రాలు ధరించి, ఓ కర్రకు వస్త్రం కట్టుకుని, చిరునవ్వులతో ద్వైతం...అద్వైతం ప్రవచిస్తూ.. ప్రజలు భక్తి మార్గంలో నడుస్తూ ఆ దేవదేవుని చెంతకు చేరుకోవాలి అంటూ తత్వ బోధన చేసుకుంటూ ప్రజల మధ్య తిరుగుతూ ఉంటారు. మద్యం, మాంసం, మగువ, కబ్జా, మర్డర్, అవినీతి, మోసం వంటి వాటి జోలికి వెళ్ళకండి నాయనలారా అంటూ ప్రజలలో ధర్మనిరతిని పెంపొందించడానికి కృషి చేస్తుంటారు. అందుకే, ప్రభుత్వానికి స్వంతంగా ఆలోచించేందుకు మనకు వలె బ్రెయిన్ ఏమీ ఉండదు. రాగ ద్వేషాలు ఉండవు. అందువల్ల, అది సంతోషపడదు. బాధపడదు. సిగ్గు అనేది ఉండడం గానీ, లేకపోవడం గానీ ఉండదు. బుద్ధి అనేది ఉండడం గానీ, లేకపోవడం అనేది గానీ ఉండదు. మంచి పనులు అనేవి చేయడం గానీ, చేయకపోవడం అనేది గానీ ఉండదు. క్రూరురాలూ కాదు. సాధుస్వభావీ కాదు. ప్రభుత్వానికి నేతృత్వం వహించే వ్యక్తి మానసిక స్థితికి జెరాక్స్ కాపీయే... ప్రభుత్వం, దాని అధికార యంత్రాంగం.

అందువల్ల, ప్రతిపక్ష నాయకుల ఆక్షేపణలు అన్నీ... కేంద్రంలో అయితే నరేంద్ర మోడీకి, తెలంగాణలో అయితే కేసీఆర్‌కు, ఆంధ్రలో అయితే జగన్మోహన్‌రెడ్డికే వర్తిస్తాయి. వారి మనస్తత్వాలు, వ్యవహారశైలి, అంతరంగ భావనలను బట్టే దేశంలో అయినా, తెలంగాణలో అయినా... ఆంధ్రాలో అయినా ప్రభుత్వ యంత్రాంగాలు స్పందిస్తూ ఉంటాయి. ప్రభుత్వశైలి, నడక బాగాలేవు అనుకుంటే... మార్చాల్సింది ప్రభుత్వాలను కాదు.

యథా అధినేత... తథా ప్రభుత్వ వ్యవహారశైలి!

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీకంటి వారిచే కళ్యాణ మహోత్సవం

గూడూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆ ఆలయ మాజీ ఛైర్మెన్, ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత శ్రీకంటి రామ్మోహనరావు – రాజ్యలక్ష్మి దంపతులు వారి అన్న కుమారుడు మనోజ్‌కుమార్ వివాహం సందర్భంగా ఇటీవల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.






## అట్టహాసంగా రెండవ విడత 'చేయూత'



గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఈ నెల 12వ తేదీ 2వ విడత వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్‌రావు పాల్గొని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోకి పాలాభిషేకం చేసి మాట్లాడుతూ అక్కా, చెల్లెమ్మల కోసం గూడూరు రూరల్ మండలంలోని 818 డ్వాక్రా గ్రూప్‌లకు 5 కోట్ల 11 లక్షల 66 వేల 640 రూపాయలు జమ చేయటం జరుగుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో వి.మురళీకృష్ణ, ఎంఆర్వో బి.లీలారాణి, ఎంపీడీఓ నాగమణి, గూడూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఏపిఓ సుజీవన, గూడూరు మండల కన్వీనర్ మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు గోపాల్‌రెడ్డి, ఎం.బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

**డీపీఓ ధనలక్ష్మి**



గూడూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో వార్డు సభ్యులకు సంబంధించి పంచాయతీరాజ్ చట్టంపై అందిస్తున్న శిక్షణా తరగతులను ఈ నెల 9న జిల్లా పంచాయతీ అధికారి ఎం.ధనలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల అభివృద్ధికి అందరూ పాటుపడాలని కోరారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులను వార్డు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాగమణి, ఎంపిపి, మండల సర్పంచులు పాల్గొన్నారు.

## నారాయణలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం



గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11న 'అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేడుకలు' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులకు స్పీచ్ విత్ ప్రజెంటేషన్ కాంపిటీషన్ నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ వి.రవిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరుపుకుంటారని, ఈ సందర్భం కౌమారదశలో ఉన్న ఆడపిల్లల ప్రాముఖ్యతను సూచిస్తుందని, వారికి అవకాశాలను కల్పించడం ద్వారా వారి శక్తిసామర్థ్యాల్ని గుర్తించే వీలుంటుందని తెలిపారు. తమ కళాశాలలో ఉమెన్స్ ఫోరమ్, జెండర్ ఛాంపియన్ ప్రోగ్రామ్స్ ద్వారా విద్యార్థినులకు ఉపయోగపడే, ప్రోత్సాహకంగా ఉండే అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తద్వారా వారు తమ సమర్థతను పెంచుకొనే వీలుంటుందంటూ పోటీలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విష్ణవర్ధనరెడ్డి, కళాశాల ఉమెన్స్ ఫోరమ్ ఇన్‌ఛార్జి వి.స్వర్ణ, అన్ని విభాగాల ఉమెన్స్ ఫోరమ్ సభ్యులు, ప్రథమ సంవత్సర విద్యార్థినులు పాల్గొన్నారు.

## గాయత్రిదేవిగా నారాయణమ్మ తల్లి

దేవీ నవరాత్రుల పూజల్లో భాగంగా గూడూరు సొసైటీ సెంటర్‌లోని శ్రీ నారాయణమ్మ తల్లి అమ్మవారు ఇటీవల గాయత్రి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూలు, వస్త్ర, ఆభరణాల అలంకారంతో ఖడ్గం, శూలం ధరించిన అమ్మవారు నయనానందకరంగా దర్శనమివ్వడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.





# సోమశిలకు భారీగా వరదనీళ్ళు

జిల్లాలోని సోమశిల జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. గత కొద్దిరోజులుగా రాయలసీమ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఈనెల 11 వ తేదిన 26వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చినట్లు జలాశయం అధికారులు పేర్కొన్నారు. ప్రవాహం ఎక్కువవుతుండడంతో జలాశయం నుంచి దిగువన ఉన్న పెన్నానదికి రోజుకు 27వేల క్యూసెక్కుల నీటిని వదిలేస్తున్నారు. ఆ నీరంతా సముద్రానికి వెళ్తోంది. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 73.644 టిఎంసిల నీటి నిల్వ ఉందని, 99.988 మీటర్ల నీటిమట్టం నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ జలాశయం నుంచి ప్రస్తుతం కండలేరు ప్రాజెక్టుకు 300 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 80 క్యూసెక్కుల వంతున నీటని విడుదల చేస్తున్నామని తెలిపారు.

# ఆర్టీసి బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

## జోనల్ ఛైర్‌పర్సన్ బత్తుల సుప్రజారెడ్డి



ఆర్టీసి బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచడంపై అధికారులు, సిబ్బంది శ్రద్ధ చూపాలని ఆర్టీసి నెల్లూరు జోనల్ ఛైర్‌పర్సన్ బత్తుల సుప్రజారెడ్డి అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈనెల 11న ఆమె నగరంలోని ఆర్టీసి ప్రధాన బస్టాండును, నెల్లూరు-1, 2 డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండులో ఉన్న వివిధ స్టాళ్ళను, విశ్రాంతిగదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ నిర్ణీత ధరలకే వస్తువులను విక్రయించేలా చూడాలని, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బస్సులు నడపాలని చెప్పారు. ఈ తనిఖీల్లో నెల్లూరు జోనల్ ఆర్టీసి ఇ.డి గోపీనాథ్‌రెడ్డి, ఆర్‌ఎం వెంకటశేషయ్య, డెప్యూటి సిటిఎం చిరంజీవిరావు, డెప్యూటి సిఎంఇ ఇబ్రహీం, డిపో మేనేజర్లు ముక్తేశ్వరరావు, శివకేశవ్ పాల్గొన్నారు.

# అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల..కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సంఘం జిల్లాశాఖకు ఈనెల 11న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరులో జరిగిన ఆ సంఘం సమావేశంలో అధ్యక్షుడిగా పి.మల్లికార్జునరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా డి.శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్.హరీష్‌కుమార్, గౌతం సుమన్, ప్రధాన కార్యదర్శిగా టి.సుధాకర్, కోశాధికారిగా వి.రాజేంద్ర, సంయుక్త కార్యదర్శులుగా ఝాన్సీ వరప్రసాద్‌రావు, అన్వర్‌లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవగా ఎన్నుకున్నారు.

## ఉమామహేశ్వరస్వామి ఆలయ

# ధర్మకర్తగా ధర్మసింగ్



నెల్లూరులోని సిఏఎం హైస్కూలు సమీపంలో ఉన్న శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి వంశపారంపర్య ధర్మకర్తగా జి.ధర్మసింగ్ ఈనెల10న ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఇ.ఓ పెంచలవరప్రసాద్ ఆయనచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ధర్మకర్త శ్రీకాంత్, ఎక్స్ అఫిషియో సభ్యుడు శ్రీనివాసులు,న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డితో పాటు కందుకూరు రమేష్, నిమ్మల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తపాలా వారోత్సవాలు

భారతీయ తపాలా శాఖ వారోత్సవాలు అక్టోబర్ 11 నుంచి 17వరకు నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని పోస్టల్ లైఫ్ ఇన్సురెన్స్ డే నిర్వహించి బీమా మేళాలను చేపట్టి, పాలసీలను సేకరించి క్లెయిమ్‌లను పరిష్కరిస్తున్నామని నెల్లూరు తపాల శాఖ సూపరింటెండెంట్ జి.కరుణాకర్ ఆబు తెలిపారు. అదేవిధంగా ఫిలట్లీ డే సందర్భంగా ఈనెల 13న కేవలం 3 వందల రూపాయలకే మన ఫోటోతో పోస్టేజ్ స్టాంప్‌ను పొందే అవకాశం కలిగిస్తున్నామని, 14న జరిగే కార్యక్రమంలో ప్రభుత్వోద్యోగులు ఆధార్ సేవలను ఉపయోగించుకోవచ్చుని, మెయిల్స్ డేని పురస్కరించుకుని ఈనెల 16న అన్ని పోస్టాఫీసుల్లో తపాలా బాక్సులకు పెయింటింగ్‌లు వేయిస్తామని ఆయన పేర్కొన్నారు.

# ప్లాస్టిక్ నిరోధానికి కృషిచేద్దాం




ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని, కనుక వాకర్స్ సభ్యులందరు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి అన్నారు. ఈనెల 10న నెల్లూరులో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు అందరూ పాటుపడాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల జరిగే నష్టాలను ప్రజలకు బాగా అర్థమయ్యేవిధంగా వివరించాలన్నారు. వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాఘవరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డిలు ప్రసంగించారు. వాకర్స్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, మాజీ గవర్నర్ దేవరాజు సుబ్రహ్మణ్యం, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్రశెట్టి, ఎంవిరెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం



నెల్లూరులోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో ఈనెల 10న రక్తదాన శిబిరం నిర్వహించారు. సినీహీరో సాయి ధరమ్‌తేజ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు, చిరంజీవి కుటుంబ అభిమానులు రక్తదానం చేశారు. 75 మంది అభిమానులు ఈ రక్తదానంలో పాల్గొన్నారు. చింరజీవి యువత ఏటూరి రవికుమార్, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, కె.కృష్ణారెడ్డి, విష్ణు, ప్రశాంత్, సాయితేజ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వరస్వామికి వైభవంగా గరుడసేవ

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ వేదాంత దేశికర్ దేవస్థానంలో కొలువైవున్న శ్రీ వేంకటేశ్వరస్వామికి ఈనెల 10న ఆలయ నిర్వాహకులు వైభవంగా గరుడసేవ నిర్వహించారు. అహోబిల మఠం వ్యవస్థాపకులు ఆదివన్ శఠగోపస్వామి ఆచార్య తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు విజయసాయి భట్టర్‌తో పాటు కిడాంబి నరసింహాచార్యులు, కేసి వరదరాజన్, నేలటూరు బాలాజీ, రమేష్, విష్ణు, కల్యాణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పిలిస్తే పలికే అమ్మ.. 'నెల్లూరు' మహాలక్ష్మమ్మ

**నెల్లూరు నగరంలో మరో సుప్రసిద్ధమైన ఆలయం.. శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయం. పిలిస్తే పలికే చల్లనితల్లిగా.. భక్తుల కష్టాలు తీర్చి..కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. ఈ సృష్టికి మూలమైన ఆ జగన్మాతే అఖిలాండ బ్రహ్మాండానికి అధిదేవత. లోకసంరక్షణ కోసం బ్రహ్మ విష్ణు శివుని అంశలతో వెలసిన మహాశక్తి ప్రతిరూపమే శ్రీ మహాలక్ష్మిదేవి. అందులోనూ మహాశక్తి దేవత.. శ్రీ మహాలక్ష్మి అమ్మవారు. నెల్లూరులోనూ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఎంతో కాలంగా భక్తజనుల పూజలందుకుంటోంది. నెల్లూరు మూలాపేటలో ఓ వేపచెట్టు కింద ఉన్న నల్లని రాతిబండపై వెలసిన ఈ అమ్మవారి ఆలయం ఆవిర్భావానికి సంబంధించి ఘనమైన చరిత్రతో పాటు.. పలు ఆసక్తికరమైన కథనాలు కూడా వినిపిస్తున్నాయి.**

శ్రీ మహాలక్ష్మిదేవి అంటే.. ఆ జగజ్జనని దుర్గామాత అంశే. ఈ విశ్వమంతటా అ శక్తి స్వరూపమే. ఆ మహాశక్తి లేనిదెక్కడ?.. సర్వం ఆ జగన్మాత సృష్టే. దేశవ్యాప్తంగా అమ్మవారికి కోకొల్లలుగా ఆలయాలున్నాయి. నెల్లూరుజిల్లాలో కూడా శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయాలు, చిన్న చిన్న గుడులు కూడా చాలానే ఉన్నాయి. ఒక్కో చోట ఒక్కోవిధంగా వెలసిన అమ్మవారు అనాదిగా భక్తుల పూజలందుకుంటూ అందరినీ అనుగ్రహిస్తూ ఉన్నారు. ప్రత్యేకించి నెల్లూరు మూలాపేటలో ఉన్న శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి గుడికి ఎంతో చరిత్ర ఉంది. స్థానికుల కథనం మేరకు ఆలయం విశేషాలిలా ఉన్నాయి.

## ఆలయ చరిత్ర :

ఇది దాదాపు నూటపాతికేళ్ల క్రితం నాటి విషయం. నెల్లూరు మూలాపేటలోని బ్రాహ్మణవీధిలో ఒక పెద్ద వేపచెట్టు కింద ఓ నల్లని రాతిబండ ఉండేది. ఆ రాతి శిల ఆకృతి శ్రీ మహాలక్ష్మి అవతారంగా కనిపించేది. రాత్రివేళ ఒక నాగసర్పం ఆ రాతి






మన దేవాలయాలు 69

బండపై పడగవిప్పి దర్శనమిస్తుండేది. స్థానిక ప్రజలు ఈ వింతను చూసి ఆశ్చర్యపోయేవారు. ఇదంతా అమ్మవారి మహిమేనని గ్రహించి అప్పట్లో ఆ గుడికి ఎదురుగా నివాసం ఉంటున్న కల్పం శివరామయ్య ఆధ్వర్యంలో స్థానిక ప్రజలంతా కలసి ఎంతో భక్తిశ్రద్ధలతో అక్కడ గుడికట్టి..శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి గుడిగా నామకరణం చేసుకుని పూజలు చేయడం ప్రారంభించారు. 1896లో ఈ గుడి నిర్మాణం జరిగింది. ఆ తర్వాత ప్రజలు, దాతల సహకారంతో 1942 ప్రాంతంలో అమ్మవారి ప్రతిమను పంచలోహ విగ్రహంగా రూపుదిద్దించి వైభవోపేతంగా ప్రతిష్ట చేయించారు. జిల్లాలో ఇలా పంచలోహ విగ్రహమూర్తికి పూజలు జరగడం కూడా ఇదే ప్రథమం. ఒకసారి.. అంటే 1980 ప్రాంతంలో నెల్లూరు నగరాన్ని తుఫాన్ ముంచెత్తుతున్న సమయంలో అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఎవరో దొంగలు అపహరించుకుపోవడానికి ప్రయత్నించి నెల్లూరు చెరువు దాకా తీసుకువెళ్ళారు కానీ, ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో.. ఇక ముందుకు వెళ్ళలేక.. అక్కడే వదిలేశారు. తెల్లవారిన తర్వాత అమ్మవారి విగ్రహం అదృశ్యమైన విషయం తెలుసుకుని ప్రజలు నగరమంతా గాలించారు. ఎట్టకేలకు ఆ పంచలోహ విగ్రహం చెరువు దగ్గర ఉండడం చూసి సంతోషంగా తీసుకువచ్చి యథాస్థానంలో ప్రతిష్టించారు. అమ్మవారిని పూజించుకున్నవారి కష్టాలు తీరిపోతుండడం, కోరిన కోరికలు నెరవేరుతుండడంతో అమ్మవారి అనుగ్రహం అందరికీ అనుభవైకవేద్యం అవుతూనే ఉంది. ఇప్పటికీ 'కల్పం' వంశస్తుల వారి ఆధ్వర్యంలో, ప్రజల సంపూర్ణ సహాయ సహకారాలతో నిత్యం అమ్మవారికి పూజలు..ధూపదీప నైవేద్యాలు అన్నీ క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

## వైభవంగా.. ఏటా నవరాత్రి వేడుకలు :

మూలాపేటలోని శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో ఎంతోకాలంగా ప్రతిఏటా దసరా నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో ముఖ్యంగా అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకారంలో దేదీప్యమానంగా వెలిగి పోతుంటారు. ఆ మరుసటిరోజునుంచి అమ్మవారిని శేషపాన్పుపై కొలువుదీర్చి ప్రత్యేకపూజలు చేస్తుంటారు. ఈ పూజలు నెల రోజుల పాటు కొనసాగుతుంటాయి. నవరాత్రి రోజుల్లో ఒక్కోరోజు ఒక్కో అవతార రూపాన్ని అలంకారంగాచేసి అమ్మవారిని దర్శించుకుని భక్తజనం తరిస్తుంటారు. ఏదేమైనా..ఏళ్ల తరబడిగా నెల్లూరు ప్రజల ఆరాధ్యదైవంగా మహాలక్ష్మమ్మ అమ్మవారు వెలుగొందుతోండడం ఎంతైనా సంతోషకరం. 'సర్వజ్ఞే.. సర్వ వరదే..సర్వ దుష్ట భయంకరి, సర్వదు:ఖ హారే..దేవీ మహాలక్ష్మి నమోస్తుతే' అంటూ ఆ శ్రీ మహాలక్ష్మీదేవి స్తోత్రాలతో నిత్యపూజ లతో శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయం కళకళలాడుతూ భక్తుల కొంగుబంగారంగా నిలిచి ఉండడం ఎంతో విశేషం.

# ఏపీలో.. ఏం జరుగుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవ పరిస్థితులు ఆయనకు తెలియడంలేదన్నది మేధావులు ముక్తకంఠంతో చెప్తున్నమాట. మరోసారి ముఖ్యమంత్రి కావాలన్న తపన. ప్రజలకు అకౌంట్లలో ఏ విధంగా డబ్బులు జమ చేయాలన్న ఆలోచన... ఈ రెండు అంశాలే ప్రస్తుతం ముఖ్యమంత్రి ప్రధాన అజెండాలుగా కనిపిస్తున్నాయన్నది కూడా వారి భావన. ఈ క్రమంలో తన చుట్టూ ఉన్న అధికారులు ఏం చెప్తే అది ఆయన వింటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల పట్ల అవగాహన లేని ఐఆర్ఎస్ అధికారులను డిప్యుటేషన్‌పై తెచ్చుకుంటున్నారు. ఎవరికి ఇష్టమైన వారిని వాళ్ళు ప్రతిపాదించుకుని ముఖ్యమంత్రి దగ్గర ఆమోదముద్ర వేయించుకుంటున్నారు. వాళ్ళ పాలనలోనే ఇప్పుడు రాష్ట్రం నడుస్తోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

అలంకారప్రాయంగా పదవులు పొందిన చాలామంది సలహాదారులు పైరవీకారులుగా అవతరించారు. ముఖ్యమంత్రిని నేరుగా కలవగలిగిన కొంతమంది ముఖ్య సలహాదారులు 'రాజకీయ అపరిపక్వత'తో ఆయన భజన చేస్తున్నారు తప్ప సలహాలిచ్చే ధైర్యం, సి.ఎంకి వాస్తవాలను చెప్పగలిగే సాహసం చేయలేకపోతున్నారు.

అధికారులకు రాజకీయాలతో పని లేదు. ముఖ్య సలహాదారులకు రాజకీయాల పట్ల అవగాహన లేదు. మంత్రులకు పని లేదు, పర్యటనలు లేవు. బుగ్గ లైటు కార్లు, ప్రోటోకాల్‌లు అనుభవిస్తూ తిరిగేయడం తప్ప ప్రభుత్వ పరిస్థితిని, పార్టీ దుస్థితినీ పట్టించుకునే నాథుడే లేడు. తరచూ కోర్టు కేసులను ఎదుర్కొంటూనే ఉన్నారు.

## ముఖ్యమంత్రికి తెలియదా...?

రాష్ట్రంలోని పరిస్థితులపైన, జగన్ పరిపాలనపైనా సామాన్యులు సైతం చర్చించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటన్నది ఆర్థిక మేధావులను పీడిస్తున్న అనుమానం. ఒక్క ట్రీలు అందుకుంటున్న వారిలో తప్ప మిగిలిన అన్ని వర్గాలలో జగన్ గ్రాఫ్ పడిపోతోందన్నది ఇప్పుడు రచ్చబండ టాపిక్. మారుమూల గ్రామాలలో కూడా చర్చించుకుంటున్న ఈ అంశాలు ముఖ్యమంత్రికి తెలియవా...? నిఘా వ్యవస్థ కూడా అంత నిర్వీర్యమైపోయిందా...? ఇవన్నీ తమకు తామే ప్రశ్నించుకుని వై.ఎస్. అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

2022 జనవరిలో పెద్దపండుగకు మంత్రివర్గ మార్పు ఉంటుందంటున్నారు. ఆ మార్పు సెలెక్షన్ కాబినెట్ వైపు ఉంటుందా లేక ఎలెక్షన్ కాబినెట్ వైపు ఉంటుందా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఎలక్షన్ దృష్టిలో పెట్టుకుని సీనియర్లకు, సమర్థులకు పెద్దపీట వేస్తే పార్టీకి మంచి రోజులు వస్తాయన్న ఆశలు చాలామందిలో కనిపిస్తున్నాయి. ఆలా కాకుండా వినయానికి, విధేయతకు ప్రాధాన్యత కల్పించి సెలక్షన్ కాబినెట్‌ను ఏర్పాటు చేస్తే... ప్రభుత్వం, పార్టీ రెండూ పెనం పైనుండి పొయ్యిలో పడ్డట్టే...!

# మహిళల 'ఆసరా'కు 370 కోట్లు



ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ ఆసరా పథకం ప్రవేశపెట్టడం జరిగిందని, బాధ్యతాయుతంగా ఉంటారనే ఉద్దేశంతో మహిళల అకౌంట్‌లో నగదు జమ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధరబాబు అన్నారు. ఈనెల 13న ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వైయస్సార్ రెండవ విడత కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాలొని మాట్లాడుతూ ప్రతి మహిళా కుటుంబ బాధ్యతలతో పాటు వారికి ఏమి కావాలో తెలుసని తదనుగుణంగా ఆసరా పథకం ద్వారా వచ్చిన ధనాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆయన అన్నారు. జిల్లాకు 307 కోట్ల రూపాయలు వైయస్సార్ ఆసరా పథకం కింద విడుదలయ్యాయని ఆయన చెప్పారు. జిల్లాను నూరు శాతం కరోనా వ్యాక్సిన్ వేసుకున్న జిల్లాగా తీర్చిదిద్దడంలో అందరూ తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు. జిల్లాలో ఇంకా రెండు లక్షల మందికి వ్యాక్సిన్ వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సీతారాంసాగర్, వెలిగొండ ప్రాజెక్టులు త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డిఓ చైత్ర వర్షిణి, డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, జడ్పీటీసీలు రామాంజనేయులు, నాగేంద్ర, ఎంపీపీలు పద్మజ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ చక్రధరబాబు, శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు ప్రభుత్వ స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ సిహెచ్‌సిలో బీడీజే ఆక్సైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో 4.4 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన 30కె.వి డీజిల్ జనరేటర్‌ను ప్రారంభించారు.

# ట్రాక్టర్ డిజైన్ పోటీల్లో తృతీయ స్థానంలో ఎన్‌బికెఆర్



కోట మండలం, విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఇటీవల జరిగిన జాతీయస్థాయి ట్రాక్టర్ డిజైన్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి అందరి అభినందనలు అందుకున్నారు. టిఏఎఫ్ఈ, ప్రముఖ ట్రాక్టర్ డిజైనర్ మాన్యుఫాక్చరర్ (చెన్నై), మరియు సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ డిజైన్-2020 పోటీల్లో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ విభాగం విద్యార్థులు జాతీయస్థాయిలో మూడవస్థానాన్ని సాధించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగాధిపతి డా.సిహెచ్ విక్రమ్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న ఏకైక కళాశాల ఎన్‌బికెఆర్ అని, ఈ పోటీల్లో తృతీయ స్థానం సాధించడం తమకెంతో సంతోషంగా ఉందని అన్నారు. ఎస్ఏఇ ఫ్యాకల్టీ అడ్వయిజర్ డా. వై.అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధం కావడానికి దసాల్ట్ త్రిడిసి ల్యాబ్, సెంట్రల్ వర్క్‌షాప్ తదితర అత్యున్నతమైన సదుపాయాలు ఉండడం, విద్యార్థుల ప్రతిభతో రాణించడం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమం కోసం తమ కళాశాల యాజమాన్యం అయిదు లక్షల రూపాయల నగదునందించిందని విద్యార్థులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రాక్టర్ డిజైన్ పోటీల్లో రాణించి తమ కళాశాల ప్రతిష్టను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన విద్యార్థులందరినీ కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ వి.విజయకుమార్‌రెడ్డిలు అభినందించారు.

# హెల్మెట్ పెట్టుకోకుంటే జరిమానా తప్పదు

## - జిల్లా ఎస్పీ విజయారావు



ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, లేకుంటే జరిమానా తప్పదని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు హెచ్చరించారు. ఈనెల 12న ఆయన పోలీసు సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది ద్విచక్రవాహనదారులు మరణాలకు గురవుతున్నారని, వారు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలకు హెల్మెట్ ఉంటే అది రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని ఎస్పీ చెప్పారు. ప్రజల భద్రత కోసమే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. ప్రజలు కూడా ఇందుకు సహకరించాలని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగి ఇంటి యజమాని మరణిస్తే ఆ కుటుంబం పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలను నడుపుతున్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వారం రోజుల పాటు జాతీయ రహదారులపై హెల్మెట్ల వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. అదేవిధంగా, కారులో ప్రయాణించేవారు అలక్ష్యం చేయకుండా సీటు బెల్టును విధిగా పెట్టుకోవాలన్నారు. కరోనా నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ వాహనాలు నడపడం, వాహనాల్లో ప్రయాణించడం చేయాలన్నారు.

## ఎదురు చూడాల్సిందే!

ఆ వీధి
తప్పి పోయింది
ఎక్కడో ఉండాల్సిన సమయంలో
మరెక్కడో కన్పించకుండా పోయింది.
ఖాయిలా పడ్డ పరిశ్రమలా
భీతి చెందిన వీధి
చింపిరిజుత్తు, ఎదిగిన గడ్డంతో
ఏదో కళ తప్పిన ముఖంతో
ఎటో వెళ్ళిపోయింది.
ముఖం లేని వ్యక్తుల కదలికల్తో
పలకరింపులు లేని మనుషుల మధ్య
తాకట్టు పెట్టిన వీధి
ఎటో వెళ్ళిపోయింది.
పట్టపగలే చీకట్లు ముసురుకొంటున్న
నిశ్శబ్దం తాళ లేక
రాత్రి దిగులు సునామీతో వేగలేక
ఆ వీధి తన దారి తాను చూసుకొన్నది
నడుస్తున్న యంత్రాల సమూహంలో
తానూ యాంత్రికతను పులుముకోలేక
కళ తప్పిన వీధి కన్పించకుండా పోయింది.
ఏ ఆశ బ్రతికిస్తుందో ఏమో
వేచి చూడాల్సిందే
వేకువజామయ్యేసరికల్లా
ఎదురెళ్ళి పలకరించాల్సిందే



- చిన్ని నారాయణరావు
9440202942

# అనుచరుడికి 'ఆనం'.. ఆత్మీయ పలకరింపు



నెల్లూరు రూరల్‌లోని కొత్తూరు శ్రీలంకకాలనీలో ఉన్న వైకాపా నాయకుడు సెల్వకుమార్ అనారోగ్యం పాలయ్యారన్న సమాచారం తెలుసుకుని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనం విజయకుమార్ రెడ్డి ఈనెల12న ఆయన నివాసానికి వెళ్ళి ఆత్మీయంగా పలకరించారు. ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకుని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కష్టాల్లో ఆదుకునేందుకు తానున్నానంటూ ఆయనకు భరోసా ఇచ్చారు.

## డిఆర్‌డిఓ సతీష్‌రెడ్డి సహకారంతో..

# పడమటికంభంపాడులో వాటర్‌ప్లాంట్

డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి సహకారంతో అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు గ్రామం బీసీ కాలనీలో ప్రజలకు నీటివసతి కోసం వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేయనున్నట్లు స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసులునాయుడు తెలిపారు. ఈ వాటర్‌ప్లాంట్ కోసం 8 లక్షల రూపాయలను సతీష్‌రెడ్డి తన సొంత నిధులను వెచ్చించి ఏర్పాటుచేయనున్నారని ఆయన చెప్పారు. బీసీ కాలనీలో ప్రజలకు గత కొంత కాలంగా మంచినీటి సమస్య ఎక్కువగా ఉండడంతో సతీష్‌రెడ్డి సేవాభావంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారని, విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు.



# స్వచ్ఛ సంకల్పాన్ని విజయవంతం చేయాలి

## ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పరిరక్షణకు రూపొందించిన 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' పథకాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే, టిటిడి పాలకమండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 12న నాయుడు పేటలో ఆ పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం వల్ల గ్రామాలు బాగా అభివృద్ధి చెందడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగుపడి ప్రజలంతా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రజలు చెత్తాచెదారాన్నంతా రోడ్లపై పడవేయకుండా క్రమపద్ధతిలో చెత్తబుట్టల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. తద్వారా గ్రామాల్లో పరిశుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యురాలు కట్టా జ్యోతిరెడ్డి, పలువురు ఎంపిపిలు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటిలో.. తేజేశ్వరి ప్రతిభ



కృషి, పట్టుదల ఉండాలేగానీ సాధించలేనిది ఏమీ ఉండదని మరోసారి రుజువు చేస్తూ ట్రిపుల్ ఐటిలో తన ప్రతిభ నిరూపించుకుని అందరి అభినందనలు అందుకుంటోంది వింజమూరు మండలంలోని కాటేపల్లి బీసీ కాలనీకి చెందిన గువ్వల తేజేశ్వరి. గ్రామీణ ప్రాంతంలో చదువుకుంటున్న ఆ విద్యార్థిని తొలినుంచి చదువులో ఆణిముత్యంలా రాణిస్తోంది. 6 నుంచి 10వ తరగతి దాకా కాటేపల్లి ఉన్నత పాఠశాలలో చదువుకున్న ఆ విద్యార్థిని టెన్త్‌లో 10కి 10 పాయింట్లు సాధించి పాఠశాలను ప్రథమస్థాయిలో నిలిపి తన సత్తా చాటుకుంది. అంతేకాక, గత నెల వింజమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఐఐఐటి ప్రవేశపరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఎన్ఎంఎంఎస్‌లో ఉత్తీర్ణత సాధించి రెండు సంవత్సరాల స్కాలర్‌షిప్‌ను కూడా పొందడం ఎంతో విశేషం. కష్టపడి చదువుకుని విద్యలో రాణిస్తూ ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన తేజేశ్వరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ రహంతుల్లాతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులంతా అభినందించారు.

# త్వరలో డిజిటల్ లైబ్రరీలు

## జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వెల్లడి

జిల్లాలో త్వరలో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి ప్రసాద్ వెల్లడించారు. ఇటీవల ఆయన అనంతసాగరం మండలంలోని కామిరెడ్డిపాడులో ఆ గ్రామ సర్పంచ్ బుట్టి భారతమ్మ ఆధ్వర్యంలో పుస్తక కేంద్రాన్ని పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మేజర్ సచివాలయ కేంద్రాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటుకు అవసరమైన సిబ్బంది కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత ఉందని, మొత్తం 105 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా కేవలం 45 మంది మాత్రమే ఉన్నారని, ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. జిల్లాలోని ఉదయగిరి, జలదంకి, కోవూరు ప్రాంతాల్లోని గ్రంథాలయాలకు నూతన భవనాల ప్రతిపాదనలు మంజూరయ్యాయని, త్వరలోనే వాటి నిర్మాణం జరుగుతుందని చెప్పారు.

## పింఛన్లు, రేషన్‌కార్డులను

# తొలగించడం అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల లబ్దిదారులను తగ్గించే లక్ష్యంగా కుంటిసాకులు చూపుతూ లక్షలాదిమంది రేషన్‌కార్డులను, పింఛన్లను తొలగిస్తుండడం అన్యాయమని టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. ఇటీవల ఆయన కోవూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు రేషన్‌కార్డు ప్రాతిపదికపై అందజేస్తోందని, అయితే రేషన్‌కార్డులే లేకుంటే ఇక పథకాలు ప్రజలకు ఎలా చేరువవుతాయని ఆయన ప్రశ్నించారు. రేషన్ కార్డులు తగ్గిస్తే పథకాల లబ్దిదారుల సంఖ్య కూడా తగ్గిపోతుందని, ఇందువల్ల నిరుపేదలు, చిరుద్యోగులు నష్టపోతారని అన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచించి తొలగించిన పింఛన్లు, రేషన్‌కార్డులను పునరుద్ధరించాలని ఆయన కోరారు, ఈ సమావేశంలో టిడిపి నాయకులు సత్యనారాయణ, విజయ్, సంపత్, గోపాల్, అశోక్, రాంబాబు, సూర్యతేజ, సురేంద్ర, శ్రీనివాసులు, ఖలీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుడు.. వైటీ నాయుడు.. ఇక లేరు

## అనారోగ్యంతో సీనియర్ నేత.. కన్నుమూత



***తాను నమ్ముకున్న పార్టీని, తనను నమ్ముకున్న కుటుంబసభ్యులని, ఇన్నాళ్ళుగా తననెంతో అభిమానించిన స్నేహితులు, సహచరులు, ఆత్మీయుల్ని, ప్రత్యేకించి టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు.. అందరినీ దు:ఖసాగరంలో ముంచి..ఒక మంచి నాయకుడు తిరిగిరాని దూరతీరాలకు తరలి వెళ్ళిపోయారు. మంచికి చిరునామాగా ఉంటూ, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా అందరినీ ఎంతగానో గౌరవించి మాట్లాడే సహృదయుడు..సౌమ్యుడు.. వైటీ నాయుడు అనారోగ్యంతో కన్నుమూయడంతో టీడీపీ ఒక మంచి నాయకుణ్ని.. సీనియర్ నేతను కోల్పోయినట్లయింది.***



తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడుగా, నిబద్ధత కలిగిన నేతగా ఎంతోకాలం నుంచి ఉంటూ, తొలి నుంచి పార్టీని సమన్వయంతో సమర్ధవంతంగా ముందుకు నడిపిన నాయకుడు.. వైటీ నాయుడు (ఎడుపాటి తిరుపాల్‌నాయుడు) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 12న మంగళవారం నాడు నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. వైటీ మరణవార్త విని అనేకమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన నివాసానికి తరలివచ్చి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి కడసారి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ సంతాపం తెలిపారు.

దాదాపు మూడుదశాబ్దాల పాటు ఆయన తెలుగుదేశం పార్టీలో ఉంటూ జిల్లాలోని నాయకులకు, కార్యకర్తలకు అందరికీ పెద్దదిక్కుగా ఉండేవారు. ఎన్టీఆర్ అంటే ఆయనకెంతో అభిమానం. ఎన్టీఆర్ పెట్టిన పార్టీ..టిడిపి అంటే ప్రాణం. తొలుత రాజకీయాల్లోకి వచ్చిన కొత్తల్లో ఆయన సిపిఎంలో ఉంటూ కౌన్సిలర్‌గా కూడా ఉన్నా.. టిడిపి ఆవిర్భావం నుంచి టిడిపిలోనే ఉన్నారు. కొద్దికాలంలోనే తెలుగుదేశం పార్టీలో ఆయన కీలకనేతగా ఎదిగారు. దుత్తలూరు జడ్పీటిసిగా టిడిపి నుంచి పోటీచేసి విజయం సాధించారు. అప్పట్లోనే ఏపిఎస్ ఆర్టీసీకి ఛైర్మెన్‌గా బాధ్యతలను కూడా చక్కగా నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్నారు. అయితే పార్టీలో ఇంకా బాగా ఎదిగి మరెన్నో ఉన్నత పదవులు పొందాల్సి ఉన్నా దురదృష్టం వెంటాడడంతో అనుకున్న స్థాయిని అందుకోలేకపోయారు. ఆయన మంచితనం, మెతకతనంతో ఉండేవారని, పార్టీ కోసం సేవచేయడమే తప్ప పదవుల కోసం పాకులాడని తత్వం ఆయనదని, అందుకే ఆశించిన స్థాయిలో పెద్దపెద్ద పదవులు పొందలేకపోయారంటూ వైటీ అభిమానులు లోలోపలే బాధపడుతుండేవారు. ఆయన రాష్ట్రస్థాయి రాజకీయాల్లో కీలకంగా ఉన్న రోజుల్లో కూడా ఆయన ఏనాడూ జిల్లాను వదిలిపెట్టి వెళ్ళేవారు కాదు. నెల్లూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలైనా నిరాశపడింది లేదు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనంటూ ఓటమిని కూడా ఆయనెంతో హుందాగా తీసుకున్నారు. ఒకదశలో ఆత్మకూరులో పోటీచేసేందుకు పార్టీ టిక్కెట్ లభించినా, చివరి నిమిషంలో దానిని మరొకరికి కేటాయించినప్పుడు కూడా ఆయన ఏమాత్రం ఎలాంటి భేషజం లేకుండా తన టిక్కెట్‌ను త్యాగం చేసి ఆదర్శ రాజకీయవేత్త అనిపించుకున్నారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు ఆయన అత్యంత సన్నిహితుడు కూడా. కొద్దికాలం క్రితం ఆయన్ను నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించాలని టిడిపి అధిష్టానం అనుకుంటున్న సమయంలోనే వైటీ అనారోగ్యానికి గురయ్యారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు వైటీ నివాసానికి వచ్చి ఆయన్ను పరామర్శించారు కూడా. అనారోగ్యం వల్ల ఆయన గత కొంతకాలంగా ఇంటికే పరిమితమయ్యారు. అయితే తాను అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు కూడా పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కార్యకర్తలు, నాయకులకు తగు సలహాలు సూచనలు ఇస్తుండేవారు. అలాంటి మంచినేత మరణించడంతో తెలుగుదేశం పార్టీ వర్గాల్లో విచారం అలముకుంది.

### నందమూరి బాలకృష్ణ దిగ్భ్రాంతి :

వైటీ నాయుడు మరణించారన్న సమాచారం తెలిసిన వెంటనే ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. వైటీనాయుడు కుమారుడు రేవంత్, తమ్ముడు బుజ్జయ్యలను ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. పార్టీకి ఆయనెంతో సేవలు చేశారని, ఆయన సేవలను పార్టీ ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని అన్నారు. వైటీ మృతిపట్ల టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తన సంతాపం తెలియజేశారు. వైటీ తనకెంతో ఆత్మీయుడని, ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని విచారం వ్యక్తం చేశారు. వైటీ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

### తరలివచ్చిన టిడిపి నేతలు :

వైటీ నాయుడు మరణించారని తెలియగానే టిడిపి నేతలు హుటాహుటిన ఆయన నివాసానికి తరలివచ్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నెల్లూరు నగర టిడిపి ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెన్ని రమణయ్య, ధర్మవరం సుబ్బారావు, పమిడి రవికుమార్, సాబిర్‌ఖాన్, జలదంకి సుధాకర్, సంపత్‌యాదవ్ తదితరులంతా వచ్చి వైటీకి నివాళులర్పించారు. ఈనెల 13వ తేది బుధవారం జరిగిన అంత్యక్రియల్లో జిల్లా నలుమూలల నుంచి ఆయన అభిమానులు, స్నేహితులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైటీకి కన్నీటి నివాళులర్పించారు.

### వైటీ మృతి తీరని లోటు :

వైటీ నాయుడు మృతి తీరని లోటని జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ విచారం వ్యక్తం చేశారు. తోటపల్లిగూడూరులోని నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు మాట్లాడుతూ పార్టీకి ఆయన చేసిన సేవలు అమోఘమని, ఎవ్వరినీ నొప్పించకుండా అందరితో కలిసిమెలిసి ఉంటూ పార్టీని ముందుకు నడిపిన ఘనత ఆయనదేనని గుర్తు చేసుకున్నారు. వెంకటాచలం మండలంలోని టీడీపీ నాయకుడు గుమ్మడి రాజాయాదవ్ ఒక ప్రకటనలో వైటీ నాయుడు మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ అనేక మంది నాయకులు, కార్యకర్తలు పలు ప్రకటనల్లో తమ సంతాపం ప్రకటించారు.

# జామాయిల్ తోటల్లో పేకాట

## నలుగురు అరెస్ట్

బోగోలు మండలం అల్లిమడుగు గ్రామ శివారుల్లో ఉన్న జామాయిల్ తోటల్లో ఇటీవల పేకాట జోరుగా సాగుతోందనే సమాచారంతో బిట్రగుంట ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో పోలీసులు దాడులు చేసి నలుగురు పేకాట రాయుళ్ళను పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, అక్కడున్న రెండు మోటార్ సైకిళ్ళు, 17,550 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా సహించేది లేదని, చట్టరీత్యా చర్యలు తప్పవని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# శ్రీవారి సేవలో సీఎం



తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా అయిదవ రోజైన సోమవారం రాత్రి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో గరుడ వాహనంపై కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనమివ్వగా, సిఎం స్వామివారి గరుడసేవలో పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు సాయంత్రం 6 గంటల సమయంలో సంప్రదాయబద్ధంగా నుదుటున తిరునామం, పంచెకట్టు ధరించి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకుని శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సీఎంకు తలపాగా ధరింపజేశారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను సీఎం తలపై పెట్టగా, వేదమంత్రోచ్ఛరణలతో, మంగళవాయిద్యాలతో, గజరాజులు వెంటరాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్



విమానాశ్రయం వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి

శ్రీవారి సన్నిధికి చేరుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీవారిని దర్శించుకున్న తర్వాత సీఎంకు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు శ్రీవారి వైభవాన్ని తెలియజేయగా, ఆలయ జీయర్లు సీఎంను శేషవస్త్రంతో సత్కరించారు. రాష్ట్రానికి అన్ని విధాలా మేలు జరగాలని, ప్రజారంజకమైన, సుపరిపాలన అందించేలా ఆశీర్వదించాలని శ్రీవారిని ఈ సందర్భంగా సీఎం ప్రార్థించారు. టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, ఇఓ జవహర్‌రెడ్డి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను సీఎంకు అందజేశారు. అనంతరం 2022 డైరీలను, క్యాలెండర్లను ముఖ్యమంత్రి జగన్ ఆవిష్కరించారు.

## శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి శ్రీకారం



ముఖ్యమంత్రి తిరుమల సందర్శనలో భాగంగా తొలుత రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతికి వచ్చి బర్డ్ ఆసుపత్రి వద్ద టిటిడి సహకారంతో దాదాపు 64 కోట్ల రూపాయలతో నిర్మించిన బాలల ఆరోగ్య ప్రదాయిని.. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత అలిపిరి వద్ద నుంచి తిరుమల దాకా పునర్నిర్మించిన నడకదారి పైకప్పుకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. అలిపిరి వద్ద నిర్మించిన శ్రీవేంకటేశ్వర సప్త గోప్రదక్షిణ మందిరం సముదాయాన్ని కూడా సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గోమాతలకు ప్రత్యేకపూజలు చేసి నమస్కరించారు. గోవులకు గ్రాసం తినిపించారు. తిరుపతి, తిరుమలల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి వెంట ఉప సభాపతి కోన రఘుపతి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో పాటు మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కన్నబాబు, కొడాలి నాని, డా.అనిల్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టిటిడి బోర్డు పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోపాటు ఎంపీలు గురుమూర్తి, మిధున్‌రెడ్డి, భరత్, ఎమ్మెల్యేలు కరుణాకర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి దంపతులు తదితరులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com